


RNI NO. TELTEL/2014/61071

# జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :107 | మంగళవారం ఆగస్ట్ 11, 2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 6 | వెల-5



# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

**కామన్వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు**

:దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని ల్వ్లీనా తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోడీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది.

2లో..

## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

**ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు**



2లో..

మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, ’హర్ ఘర్ తిరంగా’ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని అన్నారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు.

## గ్లోబల్ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్

**గోదావరి పుష్కరాలు-2027 కు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం**



- ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి గ్లోబల్ టూర్ ఆపరేటర్లు భాగస్వాములు కావాలని మంత్రి దుర్గేష్ పిలుపు
- ఏపీలో పర్యాటక అవకాశాలపై ఐఏటీఓ సమావేశంలో ప్రత్యేక చర్చ
- పుష్కరాల నాటికి ఆధ్యాత్మిక సర్క్యూట్లు, పంచారామ క్షేత్రాల దర్శనం,
- సెప్టెంబరు 10 నుండి 13 వరకు విశాఖపట్నంలో ఐఏటీఓ వార్షిక సదస్సు

2లో

## వరంగల్‌లో ఉద్యమాన్ని ‘పెద్ది’ ఒంటిచేత్తో నడిపించారు: కేటీఆర్

నర్సంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు.

2లో



# సాగర్‌లో ముగిసిన వరుణయాగం

**పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు**


### వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు



రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ వేదికగా ’మహా వరుణ యాగం’ నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు , వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమగుండాలతో ఈ మహా యాగాన్ని శాస్త్రోక్తంగా పూజలు జరిపి పూర్తి చేశారు. ఈ వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని హోమగుండంలో పూర్ణాహుతి సామాగ్రిని సమర్పించారు. కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు , రిజర్వాయర్లు నిండి పంటలు సమృద్ధిగా పండాలని సీఎం దంపతులు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ క్రతువులో పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొనగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కాంక్షిస్తూ.. ప్రభుత్వం వరుణయాగం నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు యాగ క్రతువులో పాల్గొన్నారు.

## ఫార్చ్యూన్ ఇండియాలో లోకేశ్‌పై కథనం

**కోటి కర్చు చేశారన్న ప్రచారం ఖండించిన ప్రభుత్వం**




2లో

- ఫార్చ్యూన్ ఇండియా పత్రికలో మంత్రి నారా లోకేశ్‌పై వ్యాసం కోసం కోటి

రూపాయలకుపైగా ప్రభుత్వ ధనం ఖర్చు చేశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం



2లో

## గోవింద నామాలతో వైకాపా పేరడీ..

**పవన్ ఆగ్రహం**

- పవిత్ర గోవింద నామాలపై వైకాపా పేరడీ
- వైకాపా నేతల తీరుపై పవన్ ఆగ్రహం
- భక్తుల మనోభావాలను కించపరిచారంటూ మండిపాటు
- ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించే చర్యలని వ్యాఖ్య
- చట్టప్రకారం ముందుకెళ్లాలని పార్టీ నేతలకు సూచన
- దైవ నామాలు, కీర్తనలను అపహాస్యం చేయొద్దని హితవు



అమరావతి: తిరుమల శ్రీవారిని భక్తితో కొలుస్తూ ఆలపించే పవిత్ర దైవ నామాలు, భక్తి గీతాలను వైకాపా నేతలు పేరడీలుగా పాడటాన్ని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఖండించారు. నెల్లూరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వైకాపా నేతలు వ్యవహరించిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ ‘ఎక్స్’లో వెల్లడించింది. దీనిపై చట్టప్రకారం ముందుకెళ్లాలని పార్టీ నేతలకు పవన్ దిశానిర్దేశం చేసినట్లు పేర్కొంది. “ప్రతిపక్ష హోదా కూడా లేని పార్టీ.. రాజకీయాల కోసం పవిత్ర గోవింద నామాలను పేరడీగా చేస్తూ భక్తుల మనోభావాలను కించపరిచింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారు వ్యవహరించిన తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉంది. మత విద్వేషాలు రేపే కుట్రపూరిత ఆలోచనలతో చేసిన ఈ చర్యలపై పార్టీ నేతలు చట్ట ప్రకారం ముందుకెళ్లాలి.

## ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

**ఎక్కడా కార్యాలయ భవనాల నిర్మాణమేదీ**

- భూభారతితో రైతులకు భరోసా కల్పించిన ప్రజాప్రభుత్వం
- గత బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ పొంగులేటి
- హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం



రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు.

జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు పండించామని ఆయన తెలిపారు.

2లో

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక



# సంపాదకీయం

## లిఖిత రూపాల నిరంకుశత్వం

మన దేశంలో – సహజంగానే – కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం.

మాట్లాడే జంతువు మనిషి మాత్రమే. సుమారు లక్ష సంవత్సరాల క్రిందట భాషకు మౌలిక రూపాలు ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞుల అంచనా. ఆదిమ మానవులు గుంపులుగా వేటాడేటప్పుడు, ఒకరినొకరు హెచ్చరించుకుంటూ, జంతువు జాడను తెలియపరచుకుంటూ ముందుకి సాగిన కాలంలో శబ్దాలు, అనుకరణలు, మాటలు అవసరమయ్యాయి. వేట ముగిసాక, రాత్రిపూట మంట చుట్టూ చేరి, మాంసం తింటూ, ఆ రోజున జరిగిన సాహసాల్ని పిల్లలకు వివరించినప్పుడు కథలు పుట్టి ఉండవచ్చు. మాటలు, పాటలయ్యాయి; పాటకి నృత్యం తోడైంది. సాహిత్యం, సంగీతం, భాషతోనే వికసించాయి. భాష అనే ఉమ్మడి సాధనమే మానవ సమూహాల తొలి అస్తిత్వ ప్రకటన.

లిపి తరవాతెప్పుడో (సుమారు క్రీ.పూ.3000) పుట్టింది. తిండిని పోగు చేసుకుంటూనో, వేటాడుతూనో, లేదా పశుపోషకులుగానో జీవించిన తెగలకు లిపి అవసరం లేదు. నదీ తీరాలలో స్థిర వ్యవసాయం మొదలై, పట్టణాలు వెల్లివిరిసాక -- నాగరికులకు ఎన్నో వస్తువులు, దినుసులు, వస్త్రాలు, మద్యం, వగైరాలు అవసరమ య్యాయి. అదనపు ఫలసాయం, వస్తు మార్పిడి, ఇతర ప్రాంతాలలో దొరికే వస్తువులను సంపాదించుకోవడానికి తోడ్పడ్డాయి. డబ్బు వాడుకలోకి వచ్చాక, దూర దేశాలతో వ్యాపారం సుగమం అయింది. నౌకా రవాణా వృద్ధి చెంది, రేవులు నగరాలయ్యాయి. ఈ క్రమంలోనే లిపి అవసరమైంది. సింధునదీ ప్రాంతంతో సహా అన్ని ప్రాచీన నాగరికతలలోనూ వర్తకుల ముద్రలకు, సుంకాల పట్టీలకు, పాలకుల ప్రకటనలకు లిపి ఆధారమైంది. శిలాక్షర రూపాల్లో శాసనాలు లిఖించబడ్డాయి.

తర్వాతి దశలో అంతవరకూ మౌఖికంగా ఉండిన జానపద గాథలకు లిఖిత రూపం ఇచ్చే ప్రయత్నం జరిగింది. ఆ రాతలు చిలవలు పలవలుగా విస్తరించాయి. ఒకే మూలకథ వివిధ ప్రాంతాల్లో, కాలాల్లో లిఖిత రూపాల్లోకి రూపాంతరం పొందింది. ఈ ప్రక్రియ, పండితుల పూనికతో, పాలకుల ఆధ్వర్యంలో జరిగింది. మౌఖిక రూపాలకు ఉండే స్థానికత, భిన్నత్వం, స్థలకాల విశేషాలకు అనుగుణంగా మలుచుకొనే ఒదుగుబాటు-- లిఖిత రూపాలకు లోపిస్తుంది. అవి శాశ్వత శాసనాలుగా, మార్చలేని బోధనలుగా తొందరలోనే అవతరిస్తాయి. దీన్నే ఆధునిక భాషా శాస్త్రానికి ఆద్యుడైన స్విస్ భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి సాసూర్ (1857--1913) 'లిఖిత రూపాల నిరంకుశత్వం' అన్నాడు. అతడి ప్రతిపాదనలను మన దేశానికి, మన ప్రాంతాలకు అన్వయించే ప్రయత్నం ఈ వ్యాసం.

పురాణాలు, ధర్మ సూత్రాలు, ముఖ్యంగా పవిత్ర గ్రంథాలు వెలువడ్డానికి లేఖనం గొప్ప వెసులుబాటుని కల్పించింది. స్థానిక విశ్వాసాల సముదాయాలు మతరూపంలో వ్యవస్థీకృతం అయ్యాయి. మనదేశంలో మాత్రం ఒక వైపు తెగల విశ్వాసాలు, మరో వైపు వ్యవస్థీకృత మతం చెట్టాపట్టాలు వేసుకుంటూ కొనసాగుతున్నాయి. చరిత్రకారుడు డి.డి. కోసంబి (1907--1966) చెప్పినట్లు -- కొత్తగా ప్రవేశించిన ఏ వ్యవస్థయినా పాత వ్యవస్థను పూర్తిగా తొలగించలేకపోవడం, అన్ని పురాతన పద్ధతులూ, లోలోపలి పొరలుగా కొనసాగడం, మన దేశపు ప్రత్యేకత. ఇందుకు మరో ఉదాహరణ -- వేల ఏళ్లపాటు కొనసాగిన వేదాల మౌఖిక రూపం. ఒక్క అక్షరం కూడా పొల్లు పోకుండా, ఉచ్చారణలో మార్పులు లేకుండా, ఈ పరంపర కొనసాగడం గొప్ప విశేషం. పవిత్ర బోధనలను ముఖస్థం చేయడమే సరైన పద్ధతి అని పూర్వీకుల భావన కావచ్చు; లేదా లిఖిత రూపంలో ఉంటే అవి ఎవరి చేతిలోకి వెళ్లి మైల పడతాయో అనే భయం కావచ్చు. నిష్ఠాపరులైన బ్రాహ్మణులకు తప్ప వేరెవరికీ అందుబాటులో లేని వేదాలను మినహాయిస్తే, పంచమ వేదమైన మహాభారతాన్నీ, అలాగే రామాయణ భాగవతాలనూ, పామరులకు విడమర్చి చెప్పేందుకై పండితులు అవసరం. ప్రవచనకారుల దృష్టి కథా, కథానాలకన్నా సామాన్య జనులు గ్రహించాల్సిన ధర్మ సూక్ష్మాలపైనే ఎక్కువగా ఉంటుంది. అన్ని వ్యవస్థీకృత మతాలలోనూ, పవిత్ర గ్రంథాల్లోని ఒక్క అక్షరాన్ని కూడా మార్చకూడదని సంప్రదాయవాదులు పట్టుబడతారు. ఆ విధంగా శాశ్వత ప్రాతిపదికపై సమాజాన్ని కట్టడి చేయగల సాధనాలను పాలకులు సమకూర్చుకున్నారు. ముద్రణాయంత్రం లిఖిత సంప్రదాయ సుస్థిరతకి, వ్యవస్థీకృత మతాల వ్యాప్తికి, విశేషంగా తోడ్పడింది.

మన దేశంలో -- సహజంగానే -- కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం. పాలకుల ఉనికిని కాపాడుకోవడానికీ, ప్రజల్ని నియంత్రించేందుకూ అత్యంత సామర్థ్యవంతమైన ఆలోచనా చక్రమే పాలకవర్గ భావజాలంగా పరిణమిస్తుంది. మౌఖిక భాషాభివృద్ధి దిగువనుండి, లిఖిత రూపం ఎగువనుండి -- తమ ప్రయాణాలను ఆరంభించాయి. ఈ క్రమంలో కులవ్యవస్థ కీలకమైన పాత్రను పోషించింది. నిజానికి భారతదేశంలో -- ప్రాచీన కాలంలోనైనా, ఆధునిక యుగంలోనైనా -- ఏ ఒక్క అభివృద్ధి ప్రక్రియ లేదా మార్పు కూడా కులవ్యవస్థకి బాహ్యంగా జరగలేదు. సామాజిక చలనం తీవ్రతరమైన సందర్భాలలో కూడా కులం బలహీన పడలేదు సరి కదా, కొత్త నిర్మాణాల్లోనూ విడదీయలేని భాగం అవుతూ వచ్చింది.

అత్యధిక సంఖ్యలో వినియోగదారులను చేరుకొనేందుకై సినిమా, టీవీ, ప్రింటు మీడియాలకు ప్రామాణిక భాష అవసరం అవుతుంది. సహజంగానే, అది ఆధిపత్య ప్రాంతాల మాండలికం అవుతుంది. ఆర్థికాభివృద్ధిలో, నదీజలాలతో సహా అన్ని సహజవనరుల అందుబాటులో తేడాల మూలంగా ఏర్పడే అసమానతలు, అంతర్గత దోపిడీ, ఉప--వలసీకరణలకి దారి తీస్తాయి. ప్రాంతీయ అస్తిత్వ ప్రకటనల్లో పైకి స్పష్టంగా కనిపించేది మాండలికం అని పిలువబడే భాష; ఆ వెనుకనే ఉండేవి చరిత్ర, సంస్కృతి. ఆర్థిక వెనుకబాటుతనం. తీవ్రమైన అసంతృప్తి, అస్తిత్వ చైతన్యాన్ని జ్వలింపజేస్తుంది; వేర్పాటువాద ఉద్యమాలు మొదలవుతాయి. అందుచేత మాండలిక భిన్నత్వం వెనుక పెద్ద కథే దాగి ఉంటుంది.

అదృష్టవశాత్తూ, ఈ నాణేనికి రెండవ పార్శ్వం కూడా ఉంది. ఇటీవలి కాలంలో, ఇంతవరకూ చదువుకి దూరంగా ఉంచబడిన సమూహాల చేతుల్లో అక్షరం ఆయుధంగా మారింది. స్వీయ అనుభవాల ప్రకటన లిఖిత రూపాల్లో ప్రాచుర్యం పొందుతోంది. ఇది ప్రజాస్వామ్యీకరణ వైపుగా మొదటి అడుగు. అక్షరాస్యత అందుబాటులోకి వచ్చాక, వారి కోసం ఎవరో కలం పట్టే అవసరం లేకుండా పీడిత సమూహాల సభ్యులే స్వయంగా రచనలు చేసే స్థాయికి ఒక్క తరంలోనే చేరుకున్నారు. నిజానికి అక్షర ప్రపంచంలోకి దూసుకొచ్చారు. ఈ రాక వెనుక గ్రామీణ పాఠశాలల్లో నిబద్ధతతో పని చేస్తూన్న ఉపాధ్యాయుల అదృశ్య పాత్ర చెప్పుకోతగ్గది. దీనికొక నేపథ్యం ఉన్నది.

సామ్రాజ్యవాద వ్యతిరేకత పెల్లుబికిన కాలంలో విద్యావంతులైన మధ్యతరగతి, అగ్రవర్ణ సమూహాలలో దేశ విముక్తి కోసమై ఆకాంక్ష బలపడింది. దానికి అనుబంధంగా సమానత్వం, సామ్యవాదం, ఆదర్శాలుగా నిలిచాయి. ఆ దశలోనే భారత రాజ్యాంగ నిర్మాణానికి బీజాలు పడ్డాయి. అభ్యుదయవాద లిఖిత సాహిత్యం ఉవ్వెత్తున ఎగసిపడి, పీడిత జనులకు దగ్గరయ్యే ప్రయత్నాలను ఉద్యమరూపాల్లో తీవ్రతరం చేసింది. ప్రజాహితంగా నడిచే ఏ ఉద్యమమైనా చైతన్యాన్ని రగిలిస్తుంది. అది ఎక్కడో, ఎప్పుడో, ఎవరో ఒకర్ని తాకుతుంది. ప్రజా కళారూపాలకు అభ్యుదయ, విప్లవోద్యమాలు సముచిత స్థానం కల్పించాయి.బాధితులు తమ స్వరాన్ని వినిపింపజేయడం మొదలైనప్పుడు, ఆత్మకథలు, లిఖిత ప్రపంచానికి తెలియని జీవిత వృత్తాంతాలు, వెలువడడం సహజం. ఆ రచనలన్నీ ప్రధానంగా మాండలికాల్లో, యాసతో ఉంటాయి. వాటి నూతనత్వం, అప్పటికే వేళ్లూని ఉన్న లిఖిత వ్యవస్థల దృష్టిని ఆకర్షిస్తుంది.

## గ్లోబల్ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్

మొదటి పేజీ తరువాయి

దేశంలోనే అత్యంత వైవిధ్యమైన పర్యాటక ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు, రాష్ట్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఏటీవో), ట్రావెల్ ట్రేడ్ భాగస్వాములు, హోటల్ రంగానికి చెందిన ప్రముఖులతో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సోమవారం న్యూఢిల్లీలోని తాజ్ అంబాసిడర్ హోటల్ లో ఒక ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని, అధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక, తీరప్రాంత, ప్రకృతి, వెల్నెస్, క్రూయిజ్ టూరిజం విరాజిల్లుతోందన్నారు. కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని వివరిస్తూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడిదారుల అనుకూల పర్యాటక విధానాలు, మెరుగైన రవాణా వసతులను ఉపయోగించుకొని రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సంఖ్య, వారి బస సమయం మరియు ఖర్చును పెంచేలా వినూత్న టూర్ ప్లాన్లు, డెస్టినేషన్ ఆధారిత, అనుభవపూర్వక, సర్క్యూట్ ఆధారిత పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేశ విదేశీ టూర్ ఆపరేటర్లను మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు. ట్రావెల్ రంగానికి చెందిన భాగస్వాములతో బలమైన సంబంధాలు అవసరమని పేర్కొన్నారు. డెస్టినేషన్ ఫెమిలియరైజేషన్ విజిట్లు, ప్రచార మద్దతు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మరియు ఇతర భాగస్వాముల సదుపాయాల కల్పన ద్వారా టూర్ ఆపరేటర్లకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీలో ప్రత్యేకించి 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలు గురించి సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ ఉత్సవాన్ని కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగానే కాకుండా గోదావరి తీరప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, హస్తకళలు, ఆహార సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఉన్న వందలాది ఘాట్లలో నిర్వహించే ఈ పుష్కరాలు పర్యాటక మరియు హోటల్ రంగ వ్యాపారాలకు సరికొత్త అవకాశాలను తెచ్చిపెడతాయని పేర్కొన్నారు.గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక సర్క్యూట్లు, పంచారామ క్షేత్రాల దర్శనం, రివర్ క్రూయిజ్ అనుభవాలు, విలేజ్ అండ్ నేచర్ టూరిజం,జిఐ ఉత్పత్తుల పర్యటనలు, గ్రామీణ, ప్రకృతి ఆధారిత పర్యాటకం వంటి ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించాలని టూర్ ఆపరేటర్లను మంత్రి దుర్గేష్ కోరారు. పుష్కరాల కోసం ఘాట్ల అభివృద్ధి, వసతి సౌకర్యాల పెంపు, రివర్ ఫ్రంట్ అందాలను తీర్చిదిద్దడం, డిజిటల్ సేవలు, మౌలిక వసతుల కల్పన, సమగ్ర ప్రచార కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు.ట్రావెల్ ట్రేడ్‌తో సుదీర్ఘకాల భాగస్వామ్యాన్ని నిర్మించుకోవడానికి ఏపీ పర్యాటక శాఖ కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిచయం చేసేందుకు ఐఏటీఓ సభ్యులు కలిసిరావాలని కోరారు. టూర్ ఆపరేటర్లు, ఇతర భాగస్వాముల మద్దతుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, గోదావరి పుష్కరాలు 2027ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక చారిత్రక పర్యాటక, సాంస్కృతిక ఉత్సవంగా తీర్చిదిద్దగలమని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ట్రావెల్ రంగానికి చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా ఏపీ పర్యాటక శాఖ, ఐఏటీవో సంయుక్తంగా 2026 సెప్టెంబరు 10 నుండి 13 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తోన్న ఐఏటీఓ (ఎయా) వార్షిక సదస్సుకు రావాలని మంత్రి దుర్గేష్ టూర్ ఆపరేటర్లకు ఆహ్వానం పలికారు.. ఈ సదస్సు ద్వారా దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటక నిపుణులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అవకాశాలను ప్రత్యక్షంగా పరిశీలించి, భాగస్వామ్య ఒప్పందాలు చేసుకునేందుకు మంచి వేదిక లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగ అభివృద్ధికి ప్రైవేట్ భాగస్వాములు మరియు టూర్ ఆపరేటర్లకు కూటమి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం, ప్రచార మద్దతు అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. అనంతరం పాత్రికేయులతో జరిగిన సమావేశంలో ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పర్యాటక రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు సంబంధించిన పలు ప్రశ్నలకు మంత్రి దుర్గేష్ వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు.ఈ సమావేశంలో ఐఏటీవో ప్రతినిధులు రవి గోసేన్, రాజ్ నిష్ కైస్తా, రాజీవ్ మెహ్రా, సంజయ్ రజ్దన్, సునీల్ మిశ్రా, దీపక్ భట్నాగర్ తదితరులు పాల్గొన్నారు

## వరంగల్‌లో ఉద్యమాన్ని 'పెద్ది' ఒంటిచేత్తో నడిపించారు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

"తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుంది"అని కేటీఆర్ అన్నారు.

## నగరంలో వాహనాల వీరంగం

### రెండు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

### రాంగ్‌రూట్‌లో వచ్చి ఆర్మీ జవాన్‌ను బలితీసుకున్న థార్

హైదరాబాద్ నగరంలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఓ మిలిటరీ జవాన్‌తో పాటు మరొకరు మృతి చెందారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన థార్ వాహనం.. ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వనపర్తి జిల్లాకు చెందిన చెల్లా శ్రీనివాసులు (50) గా గుర్తించారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందగానే ఘటనాస్థలికి మాదాపూర్ పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదర్‌షాకోట్ ప్రాంతంలో వేగంగా దూసుకొచ్చిన మహీంద్రా థార్ కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఓ ఆర్మీ జవాన్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం ప్రకారం.. మహీంద్రా థార్ కారు రాంగ్ రూట్‌లో అత్యంత వేగంగా వచ్చి ముందుగా ఓ ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టింది. అనంతరం అక్కడి నుంచి ఆగకుండా వెళ్లిపోయిన కారు మరికొందరిని కూడా ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఆర్మీ జవాన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన కారులో ఐదుగురు యువకులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. వారు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అతివేగంతో పాటు రాంగ్ రూట్‌లో అడ్డగోలుగా కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన కారు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతానికి చెందిన బాబు గౌడ్ కి చెందినదిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే నార్సింగ్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. కారు డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న యువకుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. జవాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హాస్టల్‌లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

### కామారెడ్డికి చెందిన విద్యార్థి పరిస్థితి విషమం

మేడ్చల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌లో దారుణం ఘటన వెలుగులోకి వచ్చింది. పదోతరగతి విద్యార్థిపై సహచర విద్యార్థులు దాడికి పాల్పడారు. కామారెడ్డికి చెందిన విద్యార్థి అభిషేక్ రెడ్డిపై 8 నుంచి 10 మంది దాడి చేసినట్లు సమాచారం.

## మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

మొదటి పేజీ తరువాయి

అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

మొదటి పేజీ తరువాయి

ఏటా స్వాతంత్య దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇదిలావుంటే తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.

## ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

మొదటి పేజీ తరువాయి

గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి..భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూములతో పాటు మిగతా ఆస్తులను కూడా మ్యాపులతో సహా అందజేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.ఎలాంటి స్వార్థం లేకుండా రైతుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన.. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీరు తక్కువగా వినియోగించే పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయానికి శంకుస్థాపన మరియు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని మంత్రులు కలిసి ప్రారంభించడం జరిగింది. హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సహచర మంత్రులు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం

### సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జగ్గారెడ్డి

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గొప్ప ముందడుగని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేక పోయారని, ఇప్పుడు కొత్త కార్డులు ఇవ్వడంతో పాటు, స్మార్ట్ కార్డులు కూడా ఇవ్వబోతున్నామని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో

హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరపున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## ఫార్చ్యూన్ ఇండియాలో లోకేశ్‌పై కథనం

మొదటి పేజీ తరువాయి

లోకేశ్‌పై తప్పుడు ప్రచారాన్ని ఖండించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జీవోకు, ఫార్చ్యూన్ ఇండియా కథనానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 18-1-2025న జారీ చేసిన జీవో.. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీ పెట్టుబడి అవకాశాల ప్రచారం కోసం ఇచ్చిందని.. ఓ ఆంగ్ల ఛానల్‌కు చెల్లింపులు చేయాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాలే ఆ జీఓలో ఉన్నాయని ఏపీ సర్కార్ వెల్లడించింది.

ఫార్చ్యూన్ ఇండియా, సిఎన్‌బిసి టివి రెండు వేర్వేరు సంస్థలని.. రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని సర్కార్ వివరణ ఇచ్చింది. జీవోను వక్రీకరించి మంత్రి నారా లోకేశ్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ప్రజలకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందించడం నేరమని హెచ్చరించింది. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేసింది. తప్పుడు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఏపీ ప్రభుత్వం స్పష్టీకరించింది.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక

మంగళవారం ఆగస్ట్ 11, 2026

# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు అందించాలి: టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ ఆగస్టు 10 జన తెలంగాణ**
సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప వీరుడు, ధైర్యసాహసాలకు ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ధర్మ పరిపాలన సంస్థ, జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతి వేదికగా నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో మహేష్ కుమార్ గౌడ్ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా "మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూలి.. సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక యోధుడు మాత్రమే కాదని, అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాన్య ప్రజల గౌరవం కోసం పోరాడిన ప్రజా నాయకుడని పేర్కొన్నారు. తన కాలంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటూ ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారని అన్నారు. ప్రజల కోసం పోరాడాలి.. అన్యాయాన్ని ఎదిరించాలి.. సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పాలి అనే స్ఫూర్తిని సర్వాయి పాపన్న గౌడ్ తన జీవితంతో చాటిచెప్పారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆయన ధైర్యం, నాయకత్వ లక్షణాలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. చరిత్రలో ఎన్నో గొప్ప పోరాటాలు జరిగినప్పటికీ, పలువురు మహనీయులకు తగిన గుర్తింపు లభించలేదని ఆయన పేర్కొన్నారు. అలాంటి మహనీయుల చరిత్రను వెలుగులోకి తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. జయంతి ఉత్సవాలు కేవలం వేడుకలకే పరిమితం కాకూడదని, మహనీయుల ఆశయాలను జీవితంలో ఆచరించడమే వారికి అందించే నిజమైన నివాళి అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యువత సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని, ఆయన చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, నాయకత్వ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రామరావు గౌడ్, అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**»రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్ళు**

**»మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

హైదరాబాద్ ఆగస్టు 10: జన తెలంగాణ
అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని, పేదల కష్టాలు, బాధలు తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదల గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, సన్నబియ్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని పేర్కొన్నారు. సొంతిల్లు అనేది ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి అన్నారు. గతంలో వివిధ దశల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను కూడా పూర్తి చేసి పేదలకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 వేల అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఇల్లు ఎవరు నిర్మించారన్నది కాకుండా, అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశలో 4.5 లక్షల ఇళ్లను, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లను, ఇప్పటివరకు హైద్రాబాద్ తో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను మంజూరు చేసేనట్లు మంత్రి తెలిపారు. అనంతరం మూడో, నాలుగో దశల్లోనూ ఇళ్లను మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించే వరకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ పక్షపాతం చూపడం లేదని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం,



మంత్రుల నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కూడా అర్హత ఆధారంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదోడు ఏ కులం, ఏ మతం, ఏ పార్టీకి చెందినవాడన్నది కాకుండా, అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశలవారీగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. నిర్మాణం ఏ దశలో ఉందో పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి విడత నిధులను విడుదల చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఇళ్ల నిర్మాణంతో పాటు లబ్ధిదారుల కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లతో పాటు అసంపూర్తిగా ఉన్న ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన పేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు పరిమిత సంఖ్యలో ఇళ్లు అందించిన పరిస్థితికి భిన్నంగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు దశలవారీగా సుమారు 8 లక్షల ఇళ్లను మంజూరు చేసి పేదలకు అందించే దిశగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాబోయే దశల్లోనూ అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. "ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇళ్లు. పేదల ముఖాల్లో సంతోషం చూడటమే ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందుకుంటున్న లబ్ధిదారులందరికీ మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**»మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ:**

ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రజలు, ప్రజాప్రతినిధులు చేస్తున్న సూచనలు, విజ్ఞప్తులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా కలిసి పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రాంత సమగ్ర అభివృద్ధికి అందరి సహకారంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ ద్వారా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న లబ్ధిదారులందరికీ మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**»హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ**

కమలాపూర్ మండలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ మండలం, గూడూరు గ్రామంలో 50, మనేపల్లి గ్రామంలో కలిపి మొత్తం 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించడం ద్వారా వారి సొంతింటి కల సాకారమవుతోందన్నారు. లబ్ధిదారులు ఇళ్లను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులను త్వరితగతిన కల్పించాలని మంత్రులను ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

**»కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ**

కమలాపూర్ మండలంలో మొత్తం 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల ద్వారా ధ్రువీకరించి ఎంపిక చేశామని తెలిపారు. తప్పుడు సమాచారం ద్వారా అనర్హులు ఎంపికైనట్లు తేలితే కేటాయింపును రద్దు చేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు వారం రోజుల్లోగా ఇళ్లను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. ఇళ్లకు తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతులను త్వరితగతిన కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.
కార్యక్రమం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అంతకుముందు కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో లబ్ధిదారులతో మంత్రులు గృహప్రవేశం చేయించారు. అనంతరం ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్వాంటమ్‌స్కేప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**»సాలిడ్-స్టేట్ బ్యాటరీ సాంకేతికతపై విస్తృత చర్చలు**

**»ఆర్ అండ్ డి, తయారీకి తెలంగాణ ఆహ్వానం**

**కరీంనగర్ ఆగస్టు 10 జన తెలంగాణ**
తెలంగాణను అధునాతన తయారీ, స్వచ్ఛ ఇంధన రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చే దిశగా రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక అడుగులు వేస్తున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన సాన్ జోస్‌లోని ప్రసిద్ధ బ్యాటరీ సాంకేతిక సంస్థ 'క్వాంటమ్‌స్కేప్' (ఒఖ్ఖుత్‌బమోఝుజూవ) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ అధ్యక్షుడు, సీఈఓ డాక్టర్ శివ శివరామ్ సహా ఉన్నతాధికారుల బృందంతో భేటీ అయి, తదుపరి తరం బ్యాటరీ సాంకేతికతలు, గ్లోబల్ సప్లై చైన్ మరియు పెట్టుబడుల అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు.
సాంప్రదాయ లిథియం-అయాన్ బ్యాటరీల కంటే అత్యంత సురక్షితమైన, వేగంగా ఛార్జ్ అయ్యే, ఎక్కువ శక్తి నిల్వ సామర్థ్యం గల 'సాలిడ్-స్టేట్ లిథియం-మెటల్' బ్యాటరీల అభివృద్ధిని డాక్టర్ శివరామ్ ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రయోగశాల స్థాయి పరిశోధనలను వాణిజ్యపరంగా భారీ స్థాయి తయారీకి తీసుకెళ్లడంలో ఎదురవుతున్న సవాళ్లను, సంస్థ సాధించిన ప్రగతిని డిప్యూటీ సీఎంకు వివరించారు. గ్లోబల్ సప్లై చైన్ -- భవిష్యత్ మార్పులు కీలక ఖనిజాల లభ్యత, అధునాతన విడిభాగాల తయారీ, సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ మరియు ఎలక్ట్రిక్ వాహనాలలో వీటి వినియోగంపై ఇరువర్గాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. భవిష్యత్తులో ఈ నూతన బ్యాటరీ సాంకేతికతలు గ్లోబల్ సరఫరా గొలుసును (గాబజూజూశ్రీవ జష్త్రుఱఅ) ఎలా పునర్నిర్మిస్తాయో, కొత్త భాగస్వామ్యాలకు ఎలా బాటలు వేస్తాయో విశ్లేషించారు.

**తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం!**

రాష్ట్రంలో శరవేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ వ్యవస్థ, అత్యుత్తమ ఇంజనీరింగ్ ప్రతిభ, స్వచ్ఛ ఇంధన రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రస్తావించారు. ఆర్ అండ్ డి (=డఐ), విడిభాగాల తయారీ, సరఫరా గొలుసు భాగస్వామ్యాలతో పాటు, భవిష్యత్తులో ఈ సాంకేతికతను భారత్‌లోనే స్థానికీకరించే (గాశీఝశ్రీఱఅఫ్ఱశీఅ) దిశగా తెలంగాణలో విస్తరణ అవకాశాలను పరిశీలించాలని క్వాంటమ్‌స్కేప్ ప్రతినిధులను కోరారు.
అంతర్జాతీయ ఆవిష్కరణల దిగ్గజాలకు, తెలంగాణలో వేగంగా పెరుగుతున్న సాంకేతిక, తయారీ రంగాలకు మధ్య బలమైన అనుసంధానాన్ని ఏర్పరచడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పర్యటన విజయవంతంగా కొనసాగుతోంది.

# వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్ లు కూడా ఇవ్వాల్సిందే..!

**--బీజేపీ మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి.**

**కరీంనగర్ ఆగస్టు 10 జన తెలంగాణ**



అధికారంలోకి వచ్చేముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలలో భాగంగా వృద్ధాప్య మరియు బీడీ కార్మికులకు కూడా ఇవ్వాల్సిందేనని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి సోమవారం నాటి పత్రికా ప్రకటన లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లో గత ప్రభుత్వం ఇచ్చినటువంటి వివిధ రకాల పెన్షన్ లను పెంచి ఇస్తామని చెప్పి రెండున్నరేళ్ళుగా మభ్యపెడుతూ చివరికి పెంపు చేయకుండా, వృద్ధాప్య మరియు బీడీ కార్మికుల పెన్షన్ లపై స్పష్టత ఇవ్వకపోవడం మోసపోరితమేనని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పెన్షన్ లకోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కు వెళ్లిన వృద్ధులకు, బీడీ కార్మికులకు సంబందించి సైట్ లో అప్షన్ కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ లో కూడా వృద్ధాప్య మరియు బీడీ కార్మికుల వివరాల నమోదు గురించి కాలం లేదని పేర్కొన్నారు. ఈ రెండు రకాల పెన్షన్ లపై దరఖాస్తు లు తీసుకుంటున్నారా లేదా సైట్ లో పొందుపరిచే విషయంలో సాంకేతిక పొరపాటు ఏమైనా జరిగిందా అనే విషయంపై స్పష్టంగా తెలపాలని, అలాగే, ఈ ఆగస్టు 15 న ఇస్తామంటున్నటువంటి పెన్షన్ లు పెంచే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలి: వరుణ యాగం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతోనే పూజలు. పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులతో కలిసి పాల్గొన్న మంత్రి కోమటి రెడ్డి**

**హైదరాబాద్ ఆగస్టు 10 జన తెలంగాణ**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నిర్వహించిన 'వరుణ యాగం'లో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహచర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, పలువురితో కలిసి మంత్రి ప్రత్యేక పూజలు, హోమంలో పాల్గొని వర్షభగవానుడి అనుగ్రహం రాష్ట్రంపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అనంతరం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..
"రాష్ట్రంలో రైతాంగం సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. వానలు సమృద్ధిగా కురిసి, జలాశయాలు నిండి, ప్రతీ ఎకరానికి సాగునీరు అందాలనే ఉన్నత సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ యాగం నిర్వహించాం. వర్షాలు బాగా కురిసి, పంట దిగుబడులు పెరిగి, రైతన్నల ముఖాల్లో ఆనందం చూడటమే మా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ప్రజలందరిపై ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నిండాలని భగవంతుడిని ప్రార్థించాను." అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# కూకట్పల్లి సీనియర్ కాంగ్రెస్ నేత సాదు ప్రతాపరెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు:

**బండి రమేష్**

**కూకట్పల్లి ఆగస్టు 10 జన తెలంగాణ**



కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సాదు ప్రతాపరెడ్డి గారి జన్మదినవేడుకలు బాలాజీనగర్ లో ఘనంగా జరిగాయి. టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గారు హాజరై ప్రతాపరెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ మరియు డివిజన్ అధ్యక్షులు తూము వేణు, సంధ్య, రాజేష్ ,సీనియర్ నేతలు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొండలరెడ్డి, విఠల్ రెడ్డి, మహిళా నేతలు స్వరూప గౌడ్, రజని, అపర్ణ నాయుడు తో పాటు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఎం ఏక్తా మాల్ టెండర్లలో భారీ కుంభకోణం --కేటీఆర్

**హైదరాబాద్ ఆగస్టు 10 జన తెలంగాణ**
ప్రజా భూమి, కేంద్ర నిధులు.. కానీ ప్రైవేటు డెవలపర్‌కు దోచి పెడుతున్న రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు టెండర్లు రద్దు చేసి, స్వతంత్ర విచారణ జరిపించాలని కేంద్రానికి కేటీఆర్ డిమాండ్ చేశారు ఽంద్ర మంత్రి నిర్మల సీతారామన్ కి లేఖ రాసిన అని
ప్రధానితో సహా కేంద్ర మంత్రులు కాంగ్రెస్ అవినీతి గురించి బహిరంగంగా మాట్లాడడమే తప్ప చర్యలు ఏవి అని ప్రశ్నించిన కేటీఆర్ ఆధారాలతో సహా వివరాలు అందించిన కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలపై స్పందించడం లేదన్నారు
తాజా పీఎం ఏక్తా మాల్ టెండర్ల కుంభకోణంలోనైనా చర్యలు తీసుకొని చిత్తశుద్ధి చాటుకోవాలని కోరిన అన్నారు పీఎం ఏక్తా మాల్ టెండర్‌ను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు టెండర్లపై స్వతంత్ర విచారణ జరిపించాలి: కేంద్రాన్ని కోరిన నాని ఽంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసానన్నారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా భూమి, ప్రభుత్వ నిధులను ప్రైవేటు డెవలపర్‌కు దోచిపెడుతోందన్నారు
2,059.81 కోట్ల పీఎం ఏక్తా మాల్ ప్రాజెక్టుపై తీవ్ర ఆరోపణలు చేశారు పీఎం ఏక్తా మాల్‌కు కేంద్రం నుంచి సుమారు ?202 కోట్ల నిధులు అని రాయదుర్గ్‌లోని 6.30 ఎకరాల విలువైన ప్రజా భూమిపై ప్రాజెక్టు ప్రభుత్వానికి కనీసం 9 లక్షల చదరపు అడుగులు.. ప్రైవేటు డెవలపర్‌కు 18 లక్షల చదరపు అడుగులు అని ప్రజా భూమి, ప్రజాధనం వినియోగిస్తూ ప్రైవేటు డెవలపర్‌కు ప్రభుత్వ వాటా కంటే రెట్టింపు స్థలం200 కోట్ల వడ్డీలేని ూూూజ× రుణాన్ని ప్రైవేటు డెవలపర్‌కు బ్యాక్-టు-బ్యాక్‌గా మళ్లించేలా టెండర్ నిబంధనలుఆధారాలతో ఫిర్యాదులు చేసినా కాంగ్రెస్ అవినీతిపై కేంద్రం చర్యలు తీసుకోవడం లేదనీ మండిపడ్డారు అమృత్ టెండర్లు, బొగ్గు కుంభకోణంపై ఫిర్యాదులు చేసినా స్పందన లేదుప్రవేట్ సంస్థల చేతికి అందకుండా నిధులు నిలిపివేయాలి.. టెండర్ రద్దు చేయాలి.. స్వతంత్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలనీ డిమాండ్ చేశారు

# కొత్త యస్వాడలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం

**21వ డివిజన్ కొత్త యస్వాడలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ ఆగస్టు 10 జన తెలంగాణ**



కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 21వ డివిజన్ పరిధిలోని కొత్త యస్వాడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గారు మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వల్ల రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందడంతో పాటు భద్రత కూడా పెరుగుతుందని తెలిపారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త యస్వాడ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని ప్రాధాన్యత ఆధారంగా చేపడతామని మేయర్ గారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీ వరాల నర్సింగం గారు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ సహకారంతో టీజీఎస్ఆర్టీసీ భరోసా

**»రోడ్డు ప్రమాదంలో అంగవైకల్యం పొందిన డ్రైవర్ కుటుంబానికి రూ50 లక్షల బీమా సహాయం అందించిన టీజీఎస్ఆర్టీసీ వీసీ & ఎండీ వై. నాగిరెడ్డి**

**»కష్టకాలంలో కొండంత అండా : ఆర్టీసీ-యూబీఐ భాగస్వామ్యం భరోసా : ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత - ఎండీ వై. నాగిరెడ్డి**

**»ఉచిత ప్రమాద బీమా ద్వారా బాధిత ఉద్యోగి కుటుంబానికి 50లక్షల ఆర్థిక సహాయం**

**»సంస్థ సిబ్బందికి అక్కరకొస్తున్న యూబీఐ సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్**

హైదరాబాద్ ఆగస్టు 10 జన తెలంగాణ

విధి నిర్వహణలో తీవ్రంగా గాయపడి శాశ్వత అంగవైకల్యంతో మంచానికే పరిమితమైన ఉద్యోగి కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) సహకారంతో కొండంత అండగా నిలిచింది. ఉచిత ప్రమాద బీమా పథకంలో భాగంగా బాధిత డ్రైవర్



కుటుంబానికి రూ. 50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. కరీంనగర్ జిల్లా కోరుట్ల డిపో లో డ్రైవర్ గా పనిచేసే ఎండీ.మదార్ (జు.323013) గత ఏడాది అక్టోబర్ 9వ తేదీ విధి నిర్వహణలో ప్రమాద బారిన పడి కాలు కోల్పోయారు. ఇంటికి పెద్ద దిక్కు శాశ్వత అంగవైకల్యం బారిన పడడంతో బాధిత డ్రైవర్ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ క్లిష్ట సమయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే 'సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్' బాధిత కుటుంబానికి ఆసరాగా నిలిచింది. సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులందరూ యూబీఐ బ్రాంచీలలో ఖాతాలు తెరిచి రూపే కార్డులు పొంది ఉండటంతో, ఈ ఖాతా ద్వారా లభించే ఉచిత ప్రమాద బీమా వర్తించింది. సోమవారం హైదరాబాద్ బస్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ వీసీ & ఎండీ వై. నాగిరెడ్డి, యూబీఐ సిజిఎం ఎం. రవీంద్రబాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్. సత్యనారాయణ బాబ్జిలతో కలిసి రూ. 50 లక్షల విలువైన చెక్కును బాధిత డ్రైవర్ మదార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎండీ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తమ తప్పు లేకపోయినా రోడ్డు ప్రమాదాల బారిన పడి ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడం లేదా శాశ్వత అంగవైకల్యానికి గురికావడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. టీజీఎస్ ఆర్టీసీ నిరంతరం ఉద్యోగుల సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తుందని, ఆపదలో ఉన్న కుటుంబాలకు సంస్థ ఎల్లప్పుడూ ధైర్యంగా అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇటువంటి బీమా పథకాలు అత్యవసర సమయాల్లో కుటుంబాలకు ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక భద్రతను ఇస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ ప్రమాద బీమా పథకం ద్వారా 27 మంది ఆర్టీసీ సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందని తెలుపుతూ, సంస్థ ఉద్యోగులకు విశేష సేవలందిస్తున్న యూనియన్ బ్యాంక్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సీహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్, సాలమన్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం. ఉషాదేవిలతో పాటు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**బాధిత డ్రైవర్ వివరాలు :**

కరీంనగర్ జిల్లా కోరుట్ల డిపోకు చెందిన డ్రైవర్ ఎండీ. మదార్ (స్టాఫ్ నంబర్: జు323013) గత ఏడాది అక్టోబర్ 9వ తేదీన (09.10.2025) బస్సు (టూ02 0040)పై కోరుట్ల నుండి హైదరాబాద్ వస్తుండగా, తెల్లవారుజామున 4:15 గంటల ప్రాంతంలో కుకనూర్ పల్లి వద్ద బ్రిడ్జిపై నిలిపి ఉంచిన లారీని (టూ08ఖూ4588) ఢీకొనడంతో తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆయన తన కాలును పూర్తిగా కోల్పోయి శాశ్వత అంగవైకల్యానికి గురయ్యారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న ఉద్యోగి మంచాన పడటంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక, మానసిక సంక్షోభంలో కూరుకుపోయింది.

# కర్రెగుట్టలో పర్యటించిన డిజిపి సి వి ఆనంద్



**»- 50 ఏళ్ల తర్వాత కర్రెగుట్టలో నేడు శాంతి: డిజిపి**

**»- అభివృద్ధికి శ్రీకారం,**

**»పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం:డీజీపీ**



**సీవీ ఆనంద్**

హైదరాబాద్ ఆగస్టు 10: జన తెలంగాణ

ఒకప్పుడు మావోయిస్టుల ప్రధాన స్థావరంగా పేరుగాంచిన తెలంగాణ--ఛత్తీస్‌గఢ్--ఒడిశా సరిహద్దులోని కర్రెగుట్ట ఇప్పుడు శాంతి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం కర్రెగుట్టలో పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, శాంతికి ప్రతీకగా తెల్ల పావురాలను ఎగురవేశారు. పోలీసు, సీఆర్పీఎఫ్, అటవీ, రెవెన్యూ తదితర శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించిన డీజీపీ, దశాబ్దాలుగా మావోయిస్టు ప్రభావానికి గురైన ఈ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి బాట పట్టిందన్నారు. డీజీపీ మాట్లాడుతూ తెలంగాణ పోలీసులు, గ్రేహౌండ్స్, ప్రత్యేక పోలీసు బలగాలు, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమన్వయ సమన్వయం వల్ల ఆపరేషన్ కగార్ చర్యల ఫలితంగానే మావోయిజమంతమైందన్నారుఆపరేషన్ కాగార్‌లో సుమారు 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని, పలువురు అగ్రనేతలు ఎన్‌కౌంటర్లలో మృతిచెందగా మరికొందరు సాధారణ జీవితంలోకి వచ్చారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి ప్రభుత్వం ఆర్థిక సాయం, భూముల కేటాయింపు, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, వారు సమాజంలో కలిసిపోయేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని వెల్లడించారు. కర్రెగుట్టకు పర్యాటకంగా అపార అవకాశాలున్నాయని, పర్యావరణ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా దీనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డీజీపీ తెలిపారు. పామూరు నుంచి చలమడ వరకు తారు రోడ్డు పనులు పూర్తయ్యాయని, త్వరలోనే బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించి ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. పామూరు శిబిరం సమీపంలోని గుత్తికోయ కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసిన డీజీపీ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో సీఆర్పీఎఫ్ పాత్రను డీజీపీ ప్రత్యేకంగా ప్రశంసించారు. కుటుంబాలకు నెలల తరబడి దూరంగా ఉండి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీఎఫ్ 196 బెటాలియన్ సిబ్బంది సేవలు శాంతి పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించాయని కొనియాడారు. ఈ పర్యటనలో అదనపు డీజీపీ సంజయ్ జైన్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, ఎస్ఐబీ ఎస్పీ సింధు శర్మ, ములుగు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ములుగు ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, సీఆర్పీఎఫ్ అధికారులు, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీకాంత్‌పై దాడి

**» పరామర్శించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్**

కరీంనగర్ ఆగస్టు 10. జన తెలంగాణ

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కిసాన్ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త శ్రీకాంత్‌పై జరిగిన దాడి తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌ను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి, ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడారు.

**»దాడుల సంస్కృతిని తెచ్చింది బీజేపీనే: గంగుల కమలాకర్**

మేయర్ పీఠం ఇస్తే దాడులా? కరీంనగర్ ప్రజలు బీజేపీకి మేయర్ పదవిని కట్టబెడితే, వారు నగరంలో 'దాడుల సంస్కృతి'కి తెరలేపారని గంగుల కమలాకర్ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ రెండు పర్యాయాలు మేయర్ పీఠం అధిరోహించినా, అలాగే కాంగ్రెస్ హయాంలోనూ కరీంనగర్‌లో ఎప్పుడూ ఇలాంటి దాడులు జరగలేదని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన సుపరిపాలన అందించామని గుర్తుచేశారు.

**»కక్షసాధింపు చర్యలు:**

బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలలో తిరుగుతున్నాడనే అక్కసుతోనే బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు తన అనుచరులతో కలిసి రోడ్డుపై శ్రీకాంత్‌పై ఇనుప రాడ్లతో పాశవికంగా దాడి చేశారని ఆరోపించారు. శ్రీకాంత్ చనిపోయాడని భావించి వారు అక్కడి నుంచి పరారయ్యారని తెలిపారు.

**»కేంద్ర మంత్రి బండి సంజయ్ కి ప్రశ్నలు...పోలీసుల తీరుపై ప్రశంసలు**

కరీంనగర్ ప్రజలకు ఏం సంకేతాలు ఇస్తున్నారు? కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు పార్టీలో ఏం జరుగుతుందో అర్థమవుతుందా?" అని గంగుల ప్రశ్నించారు.

?గతంలో తన కార్యాలయంపై దాడి జరిగినప్పుడే హోం మంత్రి హోదాలో ఉన్నవారు స్పందించి చర్యలు తీసుకుని ఉంటే, నేడు ఇలాంటి దాడులు పునరావృతం కాకపోయేవని అన్నారు. కిసాన్ నగర్‌లో తాము రోడ్లు వేయిస్తే, బీజేపీ నాయకులు రాడ్లతో ప్రజలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. గెలిచి మూడు నెలలు కూడా కాకముందే దాడులకు తెరలేపారని ధ్వజమెత్తారు.

**»పోలీసుల పనితీరు:**

పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ పార్టీవారైనా సరే చట్టం ముందు శిక్షించాల్సిందేనని స్పష్టం చేశారు.

**»అభివృద్ధి వర్సెస్ విధ్వంసం**

కసీఆర్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్‌ను రూ.1,650 కోట్లతో అత్యద్భుతంగా, సురక్షితమైన 'స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దామని తెలిపారు.కంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ నగరానికి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తారనుకుంటే, కేవలం దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ ఎప్పుడూ శాంతియుతంగా, సేఫ్ సిటీగా ఉండాలని ఆకాంక్షించారు.

**?బీఆర్ఎస్ శ్రేణులకు పూర్తి భరోసా.**

?బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ తన కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యకర్తలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్వరలోనే కరీంనగర్‌కు రానున్నట్లు తెలిపారు.

?రెండేళ్లలో ఈ ప్రభుత్వం తొలగిపోతుంది, ప్రతి ఒక్కరి లెక్కలు తేలుస్తాము. మేము కూడా ప్రతిదాడులు చేయము కానీ చట్టం ముందే దోషులను నిలబెడతాము" అని హెచ్చరించారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి స్పందించి, హింసకు పాల్పడిన వారిని పార్టీ నుండి సస్పెండ్ చేసి తమ నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే గంగుల తో పాటు బిఆర్ఎస్ కార్పొరేటర్లు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)

**జితేష్ వి. పాటిల్, ఐఏఎస్**

హైదరాబాద్ ఆగస్టు 10 జన తెలంగాణ

ప్రజాబాట (గ్రీఘయి దీఘ్) కార్యక్రమంలో భాగంగా 11.08.2026 (మంగళవారం) ఉదయం 8:30 గంటలకు అడ్డగుట్టలోని సమోసా గార్డెన్ డీటీఆర్, వడ్డెర బస్తి ప్రాంతంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ, డీటీఆర్‌ల నిర్వహణ, వినియోగదారులకు అందిస్తున్న సేవలు, స్థానికంగా ఉన్న విద్యుత్ సంబంధిత సమస్యలు చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. అలాగే స్థానిక ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేయనున్నారు.

## సైబరాబాద్‌లో ట్రాఫిక్ బాటిల్‌నెక్స్‌కు శాశ్వత పరిష్కారం

=================

**»అడ్డంకిగా ఉన్న యుటిలిటీల గుర్తింపు.. అవసరమైన చోట షిఫ్టింగ్**

**»రోడ్డు నిర్మాణానికి ముందే వాటర్--సీవరేజ్ లైన్లకు సమగ్ర ప్రణాళిక**

**»అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ**

హైదరాబాద్ ఆగస్టు 10 జన తెలంగాణ

కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ పరిధిలో ముఖ్యంగా పీక్ అవర్స్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ప్రధాన జంక్షన్లు, రోడ్డు కారిడార్లు, బాటిల్‌నెక్స్‌ను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం, యుటిలిటీల షిఫ్టింగ్, తాగునీరు, సీవరేజ్ మౌలిక వసతుల అభివృద్ధిపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఇందులో సైబరాబాద్ కమిషనర్ సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో పాటు విద్యుత్, రోడ్లు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**బాటిల్‌నెక్స్‌కు శాశ్వత పరిష్కారం**

ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ నెమ్మదిస్తున్న ప్రాంతాలు, తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్న జంక్షన్లను క్షేత్రస్థాయిలో గుర్తించి, సమస్యలకు కారణాలను విశ్లేషించాలని సమావేశంలో నిర్ణయించారు. రోడ్ల విస్తరణకు, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, కేబుళ్లు, వాటర్ సప్లై వాల్వులు, మ్యాన్‌హోళ్లు, తాగునీటి పైప్‌లైన్లు, సీవరేజ్ లైన్లు తదితర యుటిలిటీలను అవసరమైన మేరకు షిఫ్ట్ చేయాలని నిర్ణయించారు. సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలకు తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కమిషనర్ సృజన సూచించారు. ఒక్కో బాటిల్‌నెక్‌కు కారణాలను గుర్తించి, సంబంధిత శాఖలకు బాధ్యతలు అప్పగించడంతో పాటు ట్రాఫిక్ పోలీస్, జలమండలి, విద్యుత్, రోడ్లు తదితర శాఖలు సంయుక్త తనిఖీలు నిర్వహించి ప్రాంతాల వారీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు.

**రోడ్డు నిర్మాణానికి ముందే వాటర్--సీవరేజ్ ప్రణాళిక**

కొత్తగా చేపట్టే రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణానికి ముందుగానే ఆయా ప్రాంతాల్లో తాగునీరు, సీవరేజ్ నెట్‌వర్క్ అవసరాలను గుర్తించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. ప్రస్తుతం ఉన్న వాటర్ సప్లై, సీవరేజ్ పైప్‌లైన్లను మ్యాపింగ్ చేయడంతో పాటు భవిష్యత్‌లో అవసరమయ్యే కొత్త లైన్లు, వాటి అలైన్‌మెంట్లు, వాల్వులు, మ్యాన్‌హోళ్లను రోడ్డు నిర్మాణ ప్రణాళిక దశలోనే గుర్తించాలని తెలిపారు. ఒకసారి రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత వాటర్, సీవరేజ్ లైన్ల కోసం మళ్లీ తవ్వాల్సిన పరిస్థితి రాకుండా అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న జలమండలి వాటర్ సప్లై వాల్వులు, పైప్‌లైన్లు, మ్యాన్‌హోళ్లు, సీవరేజ్ నెట్‌వర్క్‌ను సంబంధిత శాఖలతో కలిసి పరిశీలించి, అవసరమైన చోట షిఫ్టింగ్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**సీవరేజ్ మాస్టర్ ప్లాన్‌తో అనుసంధానం**

సైబరాబాద్ పరిధిలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని తాగునీరు, మురుగునీటి నిర్వహణ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని ఎండీ సూచించారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో సీవరేజ్ పనులు జలమండలి సీవరేజ్ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు.ు+×జజజ పరిధిలో ఉత్పత్తయ్యే మురుగునీరు, దాని శుద్ధి, జలమండలి సీవరేజ్ నెట్‌వర్క్‌లోకి విడుదల చేసే విధానంపైనా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం, భవిష్యత్‌లో ఉత్పత్తయ్యే మురుగునీటి పరిమాణాన్ని అంచనా వేసి, జలమండలి నెట్‌వర్క్‌పై అదనపు భారం పడకుండా అవసరమైన శుద్ధి, కనెక్టివిటీ, నెట్‌వర్క్ విస్తరణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

**మాన్సూన్ పరిస్థితులపై సమీక్ష**

అంతకుముందు జలమండలి డైరెక్టర్స్ ఆఫ్ ఆపరేషన్స్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఎండీ అశోక్ రెడ్డి మాన్సూన్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. సీవరేజ్ ఓవర్‌ఫ్లోలు, పెండింగ్ పనులు, బ్యారికేడింగ్, రోడ్డు రిస్టోరేషన్, తాగునీటి సరఫరా, వాటర్ లాగింగ్ ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తరచూ మురుగు పొంగే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, పనులు జరుగుతున్న ప్రాంతాల్లో పటిష్ఠమైన బ్యారికేడింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పైప్‌లైన్, సీవరేజ్ పనులు పూర్తయిన వెంటనే సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రోడ్డు రిస్టోరేషన్ చేపట్టాలని ఆదేశించారు. వర్షాల సమయంలో లోతట్టు, వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని, తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. సైబరాబాద్ పరిధిలో వాటర్ సప్లై, సీవరేజ్, యుటిలిటీ షిఫ్టింగ్, రోడ్డు రిస్టోరేషన్ అంశాలపై సంబంధిత శాఖలతో సమన్వయంతో ప్రాంతాల వారీగా పరిష్కార కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

## అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఆషాఢ బోనాల ఉత్సవం



హైదరాబాద్ ఆగస్టు 10 జన తెలంగాణ

పాతబస్తీలోని చారిత్రాత్మక అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఆషాఢ బోనాల ఉత్సవాల్లో అత్యంత కీలకమైన ఘటం ఊరేగింపును హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ సోమవారం ప్రారంభించారు. అంతకుముందు ఆలయాన్ని సందర్శించిన ఆయన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ... విశిష్ట చరిత్ర కలిగిన అక్కన్న మాదన్న ఆలయంలో ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పూర్వ కాలంలో ప్లేగు వంటి ప్రాణాంతక వ్యాధులు, వరదల నుంచి ప్రజలను కాపాడిన మహంకాళి అమ్మవారి దయ ఎల్లప్పుడూ నగర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు సాగే మార్గాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. హరిబౌలిలోని అక్కన్న మాదన్న ఆలయం నుండి ప్రారంభమైన ఈ ఘటం ఊరేగింపు గౌలిపురా, లాల్ దర్వాజ, శాలిబండ మీదుగా సాగి నయాపూల్ వద్ద ముగుస్తుందని తెలిపారు. గత నెల రోజులుగా గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజతో పాటు నగరవ్యాప్తంగా బోనాల ఉత్సవాలు భక్తుల సహకారంతో ప్రశాంత వాతావరణంలో, వైభవంగా ముగిశాయని తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసిన ఆలయ ధర్మకర్తలకు, నిర్వాహకులకు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులకు, భక్తులకు నగర పోలీస్ తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు శ్రమించిన పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ ఘటం ఉరేగింపు కార్యక్రమంలో అదనపు సీపీ క్రైమ్స్ ఎం. శ్రీనివాస్, ఐపీఎస్, అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, డీసీపీ టాస్క్ ఫోర్స్ వైభవ్ గైక్వాడ్, ఐపీఎస్, డీసీపీ చార్మినార్ జోన్ ఖారే కిరణ్ ప్రభాకర్, ఐపీఎస్, డీసీపీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఆర్. వెంకటేశ్వర్లతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్, జనరల్ సెక్రెటరీ దత్తాత్రేయ, సలహాదారు రాజారత్నం, ఇతర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 'పళ్ళ బురుసు' సినిమా చూస్తున్నంతసేపూ నవ్వుతూనే ఉన్నాను. అదే సమయంలో కళ్లల్లో నీళ్లు వచ్చాయి, మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా ఉంది: ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున

జన తెలంగాణ సినిమా

అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న చిత్రం పళ్ళబురుసు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది, 'పళ్ళ బురుసు' ఆగస్టు 14న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకకు కింగ్ నాగర్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ప్రెస్ మీట్ లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ: "అందరికీ నమస్కారం. అన్నపూర్ణ స్టూడియోస్‌కు ఇది 50వ సంవత్సరం. నాన్నగారు ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో అద్భుతమైన చిత్రాలను నిర్మించాం. జాతీయ అవార్డులు అందుకున్న సినిమాలను కూడా రూపొందించాం. ఈ 50వ సంవత్సరం సందర్భంగా మా టీమ్ అంతా కలిసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. అందులో భాగంగా డిస్ట్రిబ్యూషన్‌ను విస్తరించాం. నాన్నగారు సినిమాలు చేసిన రోజుల్లో డిస్ట్రిబ్యూషన్ ఎలా ఉండేదో, ఆ పద్ధతిని మళ్లీ తీసుకురావడంతో పాటు దాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నాం. ఇటీవలే డిస్ట్రిబ్యూషన్‌ను ప్రారంభించాం. అది చాలా విజయవంతంగా సాగుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఎన్నో మంచి సినిమాలు చేశాం. ఇకపై మరింత వేగంగా, మరింత బలంగా సినిమాలు చేయాలని, మరింతమంది కొత్తవాళ్లకు అవకాశాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగానే ఈ సినిమాలను ప్రారంభించాం. మొన్ననే 'లెనిన్'ను రిలీజ్ చేశాం. ఇప్పుడు 'పళ్ళ బురుసు'ను విడుదల చేస్తున్నాం. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక' సినిమాను రిలీజ్ చేయబోతున్నాం. ఆ తర్వాత మరో రెండు సినిమాలు కూడా ఉన్నాయి. వీటితో పాటు నా 'కింగ్ 100' కూడా రాబోతోంది. ఇకపై అన్నపూర్ణ స్టూడియోస్ చాలా బిజీగా ఉంటుంది. ఇకపై మరింత జోరుగా సినిమాలు చేయబోతున్నాం. 'పళ్ళ బురుసు' సినిమా గురించి చెప్పాలంటే.. తల్లిదండ్రులను చూసుకోవడం కంటే అదృష్టం మరొకటి ఉండదు. నా తల్లిదండ్రులను నేను చూసుకున్నాను. వాళ్లు నన్ను చిన్నప్పుడు చూసుకున్నారు. మనకు చిన్నప్పుడు ఏ భయం వచ్చినా తల్లిదండ్రుల చేయి పట్టుకుంటాం. మనం పెద్దయ్యాక వాళ్ల బాధ్యతను తీసుకోవాలి. ఎవరైనా సరే తల్లిదండ్రులకు సేవ చేయాలి. అమల తన పేరెంట్స్ ని అద్భుతంగా చూసుకుంటుంది. తనతో ఎప్పుడూ చెబుతుంటాను.. తనకంటే అదృష్టవంతురాలు ఎవరూ లేరని. తల్లిదండ్రులను చూసుకోవడం చాలా ముఖ్యం. ఉదయ్ నాకు కథ చెప్పినప్పుడు ఇదే విషయం నాకు గుర్తుకు వచ్చింది. ఈ కథను అతను చాలా ఎంటర్టైనింగ్‌గా చెప్పాడు. సుధాకర్ రెడ్డి గారు, శంభూతాత పాత్రలో అద్భుతంగా చేశారు. మురళీధర్ గౌడ్ గారి నటన కూడా చాలా బాగుంది. ఇందులో నటించిన ప్రతి ఒక్కరూ చక్కని నటన కనబరిచారు. చాలా మంచి టీమ్‌వర్క్‌తో చేసిన సినిమా ఇది. సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. పవన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. 'లవ్ స్టోరీ' మ్యూజిక్‌ను నేను ఇప్పటికీ వింటూ ఉంటాను. ఈ సినిమాకు కూడా ఆయన చాలా అద్భుతమైన సంగీతాన్ని అందించారు. నేను సినిమా చూశాను. చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంది. సినిమా చూస్తూ నవ్వుతూనే ఉన్నాను. అదే సమయంలో కళ్లల్లో నీళ్లు వచ్చాయి, మనసు బరువెక్కింది. ఈ సినిమా చేసినందుకు మాకు చాలా తృప్తిగా ఉంది. అందరూ ప్రేమించి తీసిన సినిమా ఇది. ఖచ్చితంగా విజయం సాధిస్తుంది. కొత్త కథతో ఎవరైనా వస్తే అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించడానికి సిద్ధంగా ఉంది. మా టీమ్‌కు కథ నచ్చితే, నేను తప్పకుండా కథ వింటాను. అన్నపూర్ణ కాలేజీకి గౌరవ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు వచ్చినప్పుడు తెలంగాణ కల్చర్‌పై ఎందుకు ఒక సినిమా తీయకూడదని అడిగారు. పళ్ళ బురుసు నేపథ్యానికి సంబంధించిన చక్కని కథ. ఆగస్టు 14 మా అమ్మగారి పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ సినిమాపై ఉంటాయని నాకు నమ్మకం ఉంది. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్.

నిర్మాత వివేక్ కృష్ణాణి మాట్లాడుతూ: అన్నపూర్ణ స్టూడియోస్‌తో కలిసి పనిచేయడం నాకు ఎంతో గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమా జర్నీలో వారితో కలిసి భాగం కావడం మరింత ఆనందంగా ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్ నా జీవితంలో చాలా ప్రత్యేకమైన సంస్థ ఉంది. దర్శకుడు ఉదయ్ తన గొప్ప విజన్‌తో ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. సుప్రియ గారు మాకు ఎంతో సపోర్ట్ చేశారు. నాగార్జున గారికి మరోసారి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఆగస్టు 14న అందరం థియేటర్లలో కలుద్దాం.

నిర్మాత సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ: "ఈ కథ మొదటిసారి విన్నప్పుడే సినిమాగా తీయాలని నిర్ణయించుకున్నాను. చాలా స్వీట్ స్టోరీ. ఇలాంటి కథను చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఎప్పుడూ కొత్త కథలనే వెతుకుతుంది. ఈసారి ఎపిక్ స్టూడియోస్‌తో కలిసి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. తాతయ్య ఉండి ఉంటే కచ్చితంగా 'మంచి పని చేశావు' అని చెప్పేవారు. కొత్తవాళ్లతో పాటు సీనియర్ యాక్టర్స్ కలిసి చేసిన సినిమా ఇది. ఇది చాలా బ్యూటిఫుల్ స్టోరీ. ఇందులో చాలా లోతైన సందేశం కూడా ఉంది. ఈ సినిమా చేయడం మాకు చాలా ప్రౌడ్‌గా అనిపిస్తోంది."

డైరెక్టర్ ఉదయ్ చౌహన్ మాట్లాడుతూ: "అందరికీ నమస్కారం. నాకు పునర్జన్మనిచ్చిన అమ్మలాంటి ప్రొడక్షన్ హౌస్‌లు అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్‌కి థాంక్యూ సో మచ్. నేను చిన్నప్పటి నుంచి నాగార్జున గారికి వీరాభిమానిని. ఆయన సినిమాల ప్రభావం నాపై ఎంతో ఉంది. అలాంటి నాగార్జున గారికి నా కథ చెప్పే అవకాశం వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. ఆ అవకాశం వచ్చినప్పుడు నేను ఎంత ఆనందపడ్డానో నాకు మాత్రమే తెలుసు. సుప్రియ గారు ఈ కథ వినగానే కచ్చితంగా సినిమా చేస్తానని చెప్పారు. నాగచైతన్య గారు కథ విని చాలా స్వీట్‌గా ఉందని అన్నారు. అలాగే ప్రసాద్ గారికి కథ చెప్పగానే రైటింగ్‌ను చాలా మెచ్చుకున్నారు. మన ఇళ్లలో జరిగే చిన్న చిన్న గొడవలు, సన్నివేశాలను నేను పరిశీలించిన అంశాలను ఇందులో చూపించాను. 'పళ్ళ బురుసు' అంటే టూత్ బ్రష్. పొద్దున్నే నిద్రలేచిన వెంటనే మనం పళ్లు తోముకోవడానికి ఉపయోగించే ఒక వస్తువుతో ఒక కథ చెప్పాలి, ఒక చిన్న విషయాన్ని పెద్ద కథగా మార్చాలి, అందులో కొత్తదనం, తాజాదనం తీసుకురావాలి అనే ఆలోచనతో చేశాను. కథ రాసుకున్న తర్వాత ఇలాంటి కథను చేయడానికి ఎవరు ముందుకు వస్తారు, ఎవరికి చెప్పాలి అని ఆలోచన ప్రతి రచయితకూ ఉంటుంది. నాగార్జున గారు ఈ కథ వినగానే అంగీకరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు. మా టీమ్‌లో పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. పవన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ప్రసాద్ గారు ఎంతో సపోర్ట్ చేశారు. సుధాకర్ రెడ్డి గారు, మురళీధర్ గారు, గోమతి, ప్రజ్వల్ అందరూ అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. వారందరికీ నా ధన్యవాదాలు. ఆగస్టు 14న మీరందరూ థియేటర్లకు వెళ్లి ఈ సినిమాను చూడాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీతో కలిసి వెళ్లండి. మీ కుటుంబంతో కలిసి ఈ సినిమాను చూస్తే అందరూ చాలా హ్యాపీగా ఫీల్ అవుతారు. అందరూ కలిసి ఎంజాయ్ చేసే సినిమా ఇది. అందరి మనుసులని హత్తుకునే సినిమా ఇది.

మురళీధర్ గౌడ్ మాట్లాడుతూ: "నాగేశ్వరరావు గారి సినిమాలు, రామారావు గారి సినిమాలు చూసి పెరిగిన నాకు అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఇలాంటి అవకాశం వస్తుందని జీవితంలో ఊహించలేదు. ఇలాంటి గొప్ప సంస్థలో పనిచేసే అవకాశం ఇచ్చిన వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. 'పళ్ళ బురుసు' సినిమా మీ అందరినీ అలరిస్తుందని, ఆనందపరుస్తుందని నమ్ముతున్నాను. అలాగే ఇందులోని కొన్ని అంశాలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. ఈ సినిమా తప్పకుండా విజయవంతం అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ: "అందరికీ నమస్కారం. 'శివ' సినిమా విడుదలైనప్పుడు మేమందరం బళ్లు కట్టుకుని థియేటర్‌కు వచ్చి సినిమా చూశాం. నాలాంటి గ్రామీణ కళాకారులకు ఈరోజు స్టేజ్ మీద నిలబడి మాట్లాడే అవకాశం కల్పించిన మహానుభావులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు నేను చేసిన సినిమాలు 79. ఇది హీరోగా నాకు మూడో సినిమా. నేను నటించిన దాదాపు అన్ని సినిమాలకు అవార్డులు వచ్చాయి. నన్ను నమ్మి, నా కోసం పెట్టుబడి పెట్టిన మహానుభావులందరికీ నమస్కారం. నాగేశ్వరరావు గారు ఎక్కడ ఉన్నా సరే ఆయన ఆశీర్వాదం మా మీద ఉంటుంది. 'పళ్ళ బురుసు' అనే పేరు వినడానికి చిన్నగా అనిపించవచ్చు కానీ సినిమా చూడటానికి మాత్రం చాలా పెద్దగా ఉంటుంది. ఈ సినిమాను చూసి ప్రతి ఒక్కరూ ఆస్వాదిస్తారు.

ప్రజ్వల్ మాట్లాడుతూ: "నాగార్జున గారికి థాంక్యూ. అన్నపూర్ణ స్టూడియోస్‌లో నటించే అవకాశం, ఇలాంటి సినిమాలో భాగమయ్యే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఇది చాలా మంచి సినిమా. సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు చాలా హ్యాపీగా ఫీల్ అవుతారు. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు."

గోమతి మాట్లాడుతూ: "నేను ఈ సినిమాతో నటిగా పరిచయం అవుతున్నాను. అన్నపూర్ణ స్టూడియో నాకు హోమ్‌లాంటిది. నాకు ఈ అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇది చాలా బ్యూటిఫుల్ స్టోరీ. ఇలాంటి కథలు మళ్లీ మళ్లీ రావు. తప్పకుండా ఈ సినిమాను మీరందరూ థియేటర్లలో చూడాలి. సినిమాను చూసి మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను."

మ్యూజిక్ డైరెక్టర్ పవన్ సీహెచ్ మాట్లాడుతూ: నాగార్జున గారికి ధన్యవాదాలు. ఇలాంటి ప్రత్యేకమైన, చాలా అరుదైన సినిమాలను ప్రోత్సహిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు. ఈ సినిమాను మేమంతా చాలా ఎంజాయ్ చేస్తూ చేశాం. మా టీమ్‌లో పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను.

లిరిసిస్ట్ సురేష్ గంగుల మాట్లాడుతూ: "నాగార్జున గారి ఎదురుగా నిలుచుని మాట్లాడటం చాలా గొప్ప ఆనందంగా ఉంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఒక సినిమాకు అన్ని పాటలు రాయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ పాటలు రాస్తున్నప్పుడు ఒక పల్లె గురించి రాస్తున్న అనుభూతి కలిగింది. డాక్టర్ ఉదయ్ గారికి, చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమా మీ అందరి మనసులను గెలుచుకుంటుంది' ఈ వేడుకలో సినిమా యూనిట్ అందరూ పాల్గొన్నారు,

# ఘనంగా 'పాంచాలి పంచభర్తృక' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్

**-ఈ నెల 14న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న సినిమా**

జన తెలంగాణ సినిమా

డా. రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'పాంచాలి పంచభర్తృక'. ఈ చిత్రంలో సరీ ఫర్, రోల్ రిడా, రాజ్ పవన్, జెమినీ సురేష్, వెంకట్ దుగ్గిరెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఫ్యామిలీ డ్రామాతో కూడిన కంప్లీట్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రాన్ని రూపొందించారు దర్శకుడు గంగ సప్తశిఖర. ఈ చిత్రాన్ని రాయల్ థ్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయిరాం ఆర్ట్స్ బ్యానర్స్ పై వెంకట్ దుగ్గిరెడ్డి (యూఎస్ఏ), రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మణ్యం నిర్మించారు. ఈ నెల 14న 'పాంచాలి పంచభర్తృక' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

మ్యూజిక్ డైరెక్టర్ మహేశ్ నారాయణ మాట్లాడుతూ – ఈ మూవీకి మ్యూజిక్ చేసేందుకు డైరెక్టర్ గంగ సప్తశిఖర చాలా ఫ్రీడమ్ ఇచ్చారు. తక్కువ టైమ్ లోనే సాంగ్స్ అన్నీ కంపోజ్ చేయగలిగాం. ప్రయోగాత్మకంగా కంపోజ్ చేసిన ఒక కవ్వాలీ సాంగ్ రాజేంద్రప్రసాద్ గారు విని ఇది చాలా బాగుంది మూవీలో పెట్టమని చెప్పారు. మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా 'పాంచాలి పంచభర్తృక' మీ అందరినీ ఆకట్టుకుంటుంది. అన్నారు.



డైరెక్టర్ గంగ సప్తశిఖర మాట్లాడుతూ – మా సినిమా ఆద్యంతం మిమ్మల్ని ఎంటర్ టైన్ చేస్తుంది. సినిమా మీకు నచ్చకపోతే మా రాయల్ థ్రోన్ బ్యానర్ ఇన్ స్టా పేజికి టికెట్ పెట్టండి మీ డబ్బులు రిటర్న్ ఇస్తాం. ప్రేక్షకులు మెచ్చిన ఏ సినిమా అయినా ఫెయిల్ కాదు. మా సినిమా ఈ నెల 14న వరల్డ్ వైడ్ రిలీజ్ అవుతోంది. అమెరికాలో కూడా పెద్ద సంఖ్యలో లొకేషన్స్ లో మా మూవీ రిలీజ్ కు వస్తోంది. మా ప్రొడ్యూసర్స్ వెంకట్ దుగ్గి రెడ్డి, రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టి వారి, సాయినాథ్ మన్యం ఎంతో ప్యాషన్ తో ఈ సినిమా నిర్మించారు. రాజ్ పవన్, వెంకట్ దుగ్గిరెడ్డి ఈ చిత్రంలో కీ రోల్స్ చేశారు. వారి నటన మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. రాజేంద్రప్రసాద్ గారు ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు నన్ను ఇంతలా వాడుకున్న దర్శకుడు నువ్వే ని కితాబు ఇచ్చారు. ఆయన ఈ సినిమాలో పాటలు, ఫైట్స్ చేశారు. ఇటీవల కాలంలో మాలాంటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ రాలేదని చెప్పగలను. మా చిత్రంలో 50కి పైగా నటీనటులు వివిధ పాత్రల్లో కనిపిస్తారు. ఒక ఈవీవీ, జంధ్యాల, అనిల్ రావిపూడి సినిమాలా మా మూవీలో ఫ్రేమ్ నిండా ఆర్టిస్టులు ఉంటారు.ఈ సినిమా మేకింగ్ లో ప్రతి ఆర్టిస్టు, టెక్నీషియన్ నాకు సపోర్ట్ చేశారు. వారందరికీ థ్యాంక్స్ చెబుతున్నా. అన్నారు.

నటుడు శ్రీనివాస్ మాట్లాడుతూ – మా డైరెక్టర్ గంగ సప్తశిఖర కు మంచి కామెడీ టైమింగ్ ఉంది.ఆయన సీన్స్ చెబుతున్నప్పుడే చాలా నవ్వుకున్నాం. నా క్యారెక్టర్ ను ఆయన ఆకట్టుకునేలా రూపొందించారు. ఈ సినిమాలోని ప్రతి పాత్ర మిమ్మల్ని ఎంటర్ టైన్ చేస్తుంది. ఈ నెల 14న థియేటర్స్ లో 'పాంచాలి పంచభర్తృక' సినిమా తప్పకుండా చూడండి. అన్నారు.

నటుడు థర్టీ ఇయర్స్ పృథ్వీ మాట్లాడుతూ – నా కెరీర్ ప్రారంభమైందే రాజేంద్రప్రసాద్ గారి ఆ ఒక్కటీ అడక్కు మూవీతో. ఆ సినిమాలో నా మొదటి సీన్ బైక్ పై వెళ్లే సీన్. ఈ సినిమా వైజాగ్ షెడ్యూల్ టైమ్ లో ఆ సీన్ చేసిన చోట రాజేంద్రప్రసాద్ గారు నేను కలిసి కాసేపు కూర్చుని మాట్లాడుకున్నాం. రాజేంద్రప్రసాద్ గారు సపోర్ట్ చేయకుంటే ఈ థర్టీ ఇయర్స్ కెరీర్ నాకు లేదు. ఈ సినిమాలో మేము కలిసి నటించడం హ్యాపీగా అనిపించింది. మా డైరెక్టర్ గంగ సప్తశిఖర ప్రతిభావంతుడు. ఆయన నవ్వుతూనే మా అందరి దగ్గర నుంచి కావాల్సిన పర్ ఫార్మెన్స్ పిండుకున్నాడు. గంగ సప్తశిఖర దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకుని ఈవీవీ గారు లేని లోటును తీర్చాలని కోరుకుంటున్నా. ఈ సినిమా సక్సెస్ కావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా. అన్నారు.

నటి కుమారి ఆంటీ మాట్లాడుతూ – యూట్యూబ్ లో నన్ను ఫేమస్ చేశారు. సినిమాల్లోకి వస్తానని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు. ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన మా డైరెక్టర్ గారికి థ్యాంక్స్ చెబుతున్నా. ఈ మూవీ నన్ను మీకు మరింత దగ్గర చేస్తుందని ఆశిస్తున్నా. అన్నారు.

నటుడు బాల మాట్లాడుతూ – దర్శకుడు గంగ సప్తశిఖర నాకు చాలాకాలంగా మిత్రుడు. నేనొక కన్నడ మూవీ ప్లానింగ్ లో ఉన్నప్పుడు ఈ కథ చెప్పారు. ఇందులో డాన్ రోల్ విలన్ గా నటించాలని చెప్పారు. డాన్ రోల్ ఎలా ఉంటుందా అని ఊహించుకుంటూ ఉన్నాను. సెట్స్ లోకి వెళ్లాక ఈ డాన్ క్యారెక్టర్ తోనూ ఫన్ క్రియేట్ చేయొచ్చని మా డైరెక్టర్ చేసి చూపించారు. రాజేంద్రప్రసాద్ గారు షూటింగ్ టైమ్ లో మంచి సలహాలు ఇచ్చి ప్రోత్సహించారు. ఒక ఫ్యామిలీ వాతావరణం సెట్స్ లో ఉండేది. మా సినిమా ఈ నెల 14న రిలీజ్ అవుతోంది మంచి ఎంటర్ టైనర్ మీరంతా చూసి ఆదరించండి. అన్నారు.

నటి సునీత మాట్లాడుతూ – ఈ చిత్రంలో పృథ్వీ గారి వైఫ్ పాత్రలో నటించాను. ఇంతమంది సీనియర్ యాక్టర్స్ నటించిన సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. మా మూవీ మిమ్మల్ని ఏమాత్రం నిరాశపర్చదు. ఆద్యంతం వినోదాన్ని అందిస్తుంది. అన్నారు.

నటుడు యోగి మాట్లాడుతూ – ప్రస్తుతం థియేటర్స్ లో కొరియన్ కనకరాజు సినిమా ఎలా మీ అందరినీ ఎంటర్ టైన్ చేస్తుందో, మా సినిమా కూడా ఆగస్టు 14వ తేదీ నుంచి అలాంటి ఎంటర్ టైన్ మెంట్ నే అందించబోతోంది. మా డైరెక్టర్ గంగ సప్తశిఖర ప్రతి ఒక్క క్యారెక్టర్ ను బాగా డిజైన్ చేశారు.ఆయన నెక్ట్స్ కూడా ఒక మంచి మూవీ చేయబోతున్నారు. అన్నారు.

నటుడు రాంకీ మాట్లాడుతూ – ఈ మూవీలో నేను నటించుకున్నా, నా బెస్ట్ విశెస్ ఈ టీమ్ కు అందించేందుకు వచ్చాను. మా డైరెక్టర్ గంగ సప్తశిఖర నెక్ట్స్ చేయబోతున్న చిత్రంలో నేనొక ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నా. మంచి ఎంటర్ టైన్ మెంట్ తో రాబోతున్న ఈ సినిమాకు మీ అందరి సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా. అన్నారు.

కో డైరెక్టర్ రేష్మ మాట్లాడుతూ – అర్జునుడికి శ్రీకృష్ణుడు ఎలా బలాన్నిస్తాడో మా సినిమాకు మీ ప్రేక్షకులంతా అండగా నిలబడాలి. మా టీమ్ అందరి సపోర్ట్ తో ఒక మంచి సినిమా చేశాం. ఇకపై కూడా మా టీమ్ తో ట్రావెల్ కొనసాగించాలని కోరుకుంటున్నా. అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు పాల్గొని తమ సినిమా మంచి విజయం సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

నటీనటులు – డా. రాజేంద్ర ప్రసాద్, సరీ ఫర్, రోల్ రిడా, రాజ్ పవన్, జెమినీ సురేష్, వెంకట్ దుగ్గిరెడ్డి, తదితరులు

టెక్నీషియన్స్

ఎడిటింగ్ – జానీ బాషా, నాగచైతన్య

సినిమాటోగ్రఫీ – కె.వి. ప్రసాద్

సంగీతం: మహేశ్ నారాయణ, బి షేక్

కథ: బాబీ కేఎస్ఆర్

స్క్రీన్‌ప్లే: రాజ్ పవన్;

బ్యానర్స్ – రాయల్ థ్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయిరాం ఆర్ట్స్

కో ప్రొడ్యూసర్స్ – వెంకట్ దుగ్గిరెడ్డి (యూఎస్ఏ), రాజ్ పవన్, శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మణ్యం

డైరెక్షన్ : గంగ సప్తశిఖర

## హీరో కిరణ్ అబ్బవరం, జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా, శ్రీకాంత్ పుప్పాల ఎపిక్ మైథాలజీ మూవీ "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ అనౌన్స్ మెంట్



జన తెలంగాణ సినిమా

"క", "కె ర్యాంప్", "చెన్నై లవ్ స్టోరీ" సినిమాలతో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న హీరో కిరణ్ అబ్బవరం మరో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కు శ్రీకారం చుట్టారు. "క" చిత్రంతో థ్రిల్లర్, "కె ర్యాంప్" తో మాస్ ఎంటర్ టైనర్, "చెన్నైలవ్ స్టోరీ"తో ఎమోషనల్ లవ్ స్టోరీ చేసిన కిరణ్ అబ్బవరం వైవిధ్యమైన జానర్స్ ను ఎంచుకుంటూ హీరోగా తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు. ఈ క్రమంలో జాయ్ ఫిలింస్ లో ఓ సినిమా, "కెఎ 13" అనే మరో సినిమాతో పాటు సుకుమార్ రైటింగ్స్ లో "కెఎ 14" సినిమా చేస్తున్న కిరణ్ అబ్బవరం ఇప్పుడు "కెఎ15" గా భారీ మైథాలజీ మూవీని ప్రకటించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ శ్రీకాంత్ పుప్పాల కాంబినేషన్ లో కిరణ్ అబ్బవరం హీరోగా ఎపిక్ మైథాలజీ మూవీ "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ ఈ రోజు అనౌన్స్ చేశారు. మన పురాణ ఇతిహాసాల్లోని ధర్మానికి అధర్మానికి మధ్య జరిగే పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాను రూపొందిస్తున్నారు కొత్త దర్శకుడు శ్రీకాంత్ పుప్పాల.

మైథాలజీ, యాక్షన్, ఫాంటసీ, ఎమోషన్ వంటి అంశాలతో గ్రాండ్ స్కేల్ లో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ మూవీ నిర్మాణం కానుంది. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ అందించనుంది. హీరో కిరణ్ అబ్బవరం ఈ చిత్రంలో పవర్ ఫుల్ రోల్ లో సరికొత్త అవతార్ లో కనిపించనున్నారు. భాషలకు అతీతంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా లార్జ్ స్కేల్ పాన్ ఇండియా చిత్రంగా "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ తెరపైకి రానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ లో ఉన్న ఈ సినిమా అక్టోబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకోనుంది. వచ్చే ఏడాది ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కు రెడీ కానుంది. ఈ చిత్రానికి కీర్తన్ స్టోరీని అందించి, కుస్సుమ్ అరోరాతో కలిసి ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు.

"ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ సినిమా గురించి నిర్మాత ప్రేరణ అరోరా మాట్లాడుతూ – "ఇంద్రపుత్ర" ఫస్ట్ ఛాప్టర్ చిత్రంతో మేమంతా ఎంతో ప్యాషన్ తో ఒక సరికొత్త సినిమాటిక్ వరల్డ్ ను క్రియేట్ చేస్తున్నాం. మన పురాణ ఇతిహాసాల నుంచి స్ఫూర్తిగా తీసుకున్న అంశాలతో నేటి ట్రెండ్ కు తగిన మేకింగ్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మేము క్రియేట్ చేయబోతున్న మైథాలజీ యూనివర్స్ లో ఈ సినిమా తొలి అడుగు మాత్రమే. కిరణ్ అబ్బవరం హీరోగా, శ్రీకాంత్ పుప్పాల దర్శకత్వంలో ప్రేక్షకులకు ఒక ఎపిక్ స్టోరీని అందించబోతున్నాం. అక్టోబర్ నుంచి మా మూవీ షూటింగ్ ప్రారంభిస్తాం. అన్నారు.

ఈ చిత్ర కాస్ట్ అండ్ క్రూ వివరాలు, అప్డేట్స్ ను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

నటీనటులు – కిరణ్ అబ్బవరం, తదితరులు

టెక్నీషియన్స్

స్టోరీ – కీర్తన్
స్క్రిప్ట్ – తన్వీ ఎన్ దత్త
కో ప్రొడ్యూసర్స్ – కీర్తన్, కుస్సుమ్ అరోరా
ప్రొడ్యూసర్స్ – జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా
స్క్రిప్ట్, డైరెక్షన్ – శ్రీకాంత్ పుప్పాల
పీఆర్ఓ – సురేష్ (ఎస్ కె మీడియా)

## యంగ్ టాలెంటెడ్ హీరో రాకేష్ వర్రే "మాయలేడి" మూవీ టైటిల్ సాంగ్ 'మాయలేడి..' రిలీజ్

జన తెలంగాణ సినిమా

యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా "మాయలేడి". ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు "మాయలేడి"తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. త్వరలోనే "మాయలేడి" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

ఈ రోజు "మాయలేడి" సినిమా నుంచి మేకర్స్ టైటిల్ సాంగ్ 'మాయలేడి..' రిలీజ్ చేశారు. విశాల్ చంద్రశేఖర్ కంపోజ్ చేసిన బ్యూటిఫుల్ ట్యూన్ కు కృష్ణకాంత్ ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. సింగర్స్ అరవింద్ అనెస్ట్, శిబి శ్రీనివాసన్, వేలు, పిటీ విక్రమ్, దేవ్ మాత్యూ, కవిత ఇలంగో అంతే అందంగా పాడారు. 'మాయలేడి..' పాట ఎలా ఉందో చూస్తే – 'మాయలేడి చెంగు చెంగున దూకెరా, మాయలేడి గుండె రక్కున దోచెరా, మిస్టరీతో మంత్రమేదో వేసే కొత్తబొమ్మ మార్చెనేమో నన్నే, పక్కనుంటే తానే నచ్చుతుంది ఏంటో తెలియదుగా, ఎవడు వీడు అపరిచితుడు, అయినవాడల్లే ఉన్నాడు, చదువుతాడు, కనులే చూస్తూ ఉంటాడు..' అంటూ సాగే ఈ పాటను హీరో హీరోయిన్స్ మధ్య క్యూట్ లవ్ సాంగ్ గా చిత్రీకరించారు.

ఇటీవల రిలీజ్ చేసిన "మాయలేడి" సినిమా గ్లింప్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ బ్యాక్ డ్రాప్ తో సాగే లవ్ స్టోరీని థియేటర్స్ లో చూడబోతున్న ఫీల్ ను ప్రేక్షకుల్లో ఈ గ్లింప్స్ క్రియేట్ చేసింది. 'మాయలేడి..' సాంగ్ కూడా ఇన్ స్టంట్ గా హిట్ అయ్యేలా కనిపిస్తోంది.

నటీనటులు –రాకేష్ వర్రే, మధుమిత సర్కార్, తదితరులు

టెక్నీషియన్స్
మ్యూజిక్ – విశాల్ చంద్రశేఖర్
బ్యానర్ – క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్
ప్రొడ్యూసర్ – రాకేష్ వర్రే
స్క్రిప్ట్, డైరెక్షన్ – ప్రశంకర్
పీఆర్ఓ – సురేష్ (ఎస్ కె మీడియా)

## 'ప్రేమనే ఊరిలో' -- టైటిల్ ఢ ఫస్ట్ లుక్ లాంచ్

జన తెలంగాణ సినిమా

ప్రేమ, అనుబంధాలు, భావోద్వేగాలకు పల్లె అందాలను జోడిస్తూ తెరకెక్కుతున్న ఆసక్తికరమైన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. అందమైన గ్రామీణ నేపథ్యం, హృదయానికి హత్తుకునే కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది.

మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా మహారత్న ప్రొడక్షన్స్, ఎస్కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. శ్రీరామ్, రమిక శివ, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రేమ, భావోద్వేగాలు, మానవ సంబంధాలు, పల్లె జీవనశైలిని ప్రతిబింబించే కథగా ఈ చిత్రం రూపొందుతోంది.

"ఔవశ్రీషెశీఎవ్ శీ్ష్త్రవ ూఖఅస శీట ూశీజవ" అనే క్యాప్షన్‌తో విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. పచ్చని పొలాలు, గాలిమరలు, ఎడ్లబండి, అందమైన పల్లె వాతావరణంతో రూపొందిన పోస్టర్ సినిమా కథలోని ప్రేమ, అనుబంధాలు, భావోద్వేగాలకు చక్కటి ప్రతిబింబంగా నిలిచింది. టైటిల్‌కు తగ్గట్టుగా ప్రేమను పల్లె అందాలతో ముడిపెట్టి చూపించిన ఫస్ట్ లుక్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది.

సినిమాకు ప్రతిభావంతమైన సాంకేతిక బృందం పనిచేస్తోంది. ఖ+ఖీ, కాంతారా వంటి చిత్రాలకు డైలాగ్స్ అందించిన హనుమాన్ చౌదరి ఈ చిత్రానికి సంభాషణలు రాశారు. ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల పాటలను రచించారు. సునద్ గౌతమ్ సంగీతం అందిస్తుండగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథ, ప్రేమ, భావోద్వేగాలు, బలమైన పాత్రలు, అందమైన పల్లె నేపథ్యంతో పాటు సురేష్ కొండేటి కంటెంట్ సెలక్షన్‌కు ఉన్న ప్రత్యేక గుర్తింపుతో 'ప్రేమనే ఊరిలో' మరో మంచి చిత్రంగా నిలుస్తుందనే అంచనాలు నెలకొన్నాయి.




## ఎం.ఎస్. రాజు మీదున్న నమ్మకంతో చెబుతున్నా.. 'అగధ' కేవలం హారర్ మూవీలా మాత్రమే ఉండదు - ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి




### ఎం.ఎస్. రాజు ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ప్రతీ క్రాఫ్ట్ మీద గ్రిప్‌ను సాధించారు. ఆయనకు ఆయనే ట్రెండ్ సెటర్‌గా మారారు - 'అగధ' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రముఖ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి

జన తెలంగాణ సినిమా

శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగధ'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్‌కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వైవా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి, ప్రముఖ దర్శకుడు బి. గోపాల్, సాయి రాజేష్, ఎస్‌కేఎన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ ఈవెంట్‌లో..

ప్రముఖ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ .. 'నాకు హనీ (ఎం.ఎస్. రాజు) మంచి స్నేహితుడు. 45 ఏళ్ల క్రితం మా జర్నీ మొదలైంది. మా నాన్న, వాళ్ల నాన్న నిర్మాతలే. ఇద్దరం సినిమా ఇండస్ట్రీలోనే పెరిగాం. సినిమాలే తీయాలని చిన్నప్పటి నుంచీ అనుకున్నాం. ఇద్దరం కోడి రామకృష్ణ గారితోనే జర్నీ ప్రారంభించాం. 1985, 1986 నుంచి ఎం.ఎస్. రాజు గారిని గమనిస్తూనే ఉన్నాను. ఆయన ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ప్రతీ క్రాఫ్ట్ మీద గ్రిప్‌ను సాధించారు. ఆయనకు ఆయనే ట్రెండ్ సెటర్‌గా మారారు. అన్ని రకాల చిత్రాల్ని ఆయన నిర్మించారు. లవ్ సబ్జెక్ట్‌లతో ఆయన ఎన్నో వండర్స్ క్రియేట్ చేశారు. ప్రతీ సంక్రాంతికి సినిమా ఇచ్చాడు. అన్నీ కూడా బ్లాక్ బస్టర్ హిట్లు అయ్యాయి. అందుకే అప్పట్లో సంక్రాంతి రాజు, తిరుగులేని రాజు, ఎదురులేని రాజు అని అనేవారు. అలాంటి రాజు ఇప్పుడు 'అగధ' సినిమాతో వస్తున్నారు. ఇందులో నాని విజువల్స్, జునైద్ ఎడిటింగ్ అద్భుతంగా అనిపించింది. ఇలాంటి మూవీని థియేటర్లోనే చూసి ఎక్స్‌పీరియెన్స్ పొందాలి. రాజు మీదున్న నమ్మకంతో చెబుతున్నా.. ఇది కేవలం హారర్ మూవీలా మాత్రమే ఉండదు. ఆర్టిస్టుల్లో ప్రతీ ఒక్కరూ పర్ ఫెక్ట్‌గా సెట్ అయ్యారు. 'అరుంధతి' టైంలో అనుష్కని చూసినప్పుడు కలిగిన ఫీలింగ్ ఇప్పుడు కామాక్షిని చూస్తే కలుగుతోంది. అందరికీ గుడ్ లక్' అని అన్నారు.

ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ .. "అగధ' టీజర్, ట్రైలర్ అందరూ చూశారు. నేను చెప్పడానికి ఇంకా ఏమీ లేదు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మరీ ముఖ్యంగా కాశీ విశాలాక్షి గారికి, అజయ్ గారికి ధన్యవాదాలు. ఆగస్ట్ 15న సక్సెస్ మీట్ నిర్వహిస్తాం. లాస్ట్ ఓవర్‌లో 24 రన్స్ కొట్టాలంటే ఆ మ్యాచ్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. కానీ నేను సూపర్ ఓవర్‌లా సినిమాని తీశాను. 'అగధ'లో టెక్నికల్ టీం, ఆర్టిస్టుల టీం కలిసి పోటాపోటీగా చేశారు. ఈ చిత్రం బ్లాక్ బస్టర్ అవుతుందని నా మనసు చెబుతోంది. అమ్మవారి ఆశీర్వాదంతో సినిమా విజయం సాధిస్తుందని నమ్ముతున్నాను. మా విశాలాక్షి గారికి, అజయ్ గారికి చాలా డబ్బు రావాలని, అందులో నాకు షేర్ ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

సాయి రాజేష్ మాట్లాడుతూ .. "రాజు గారి వద్ద నేను రెండేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ఆఫీస్‌లో కూర్చుని ఎన్నో నేర్చుకున్నాను. రాజు గారి వద్ద నేను స్క్రీన్ ప్లే రైటింగ్ అద్భుతంగా నేర్చుకున్నాను. జయాపజయాలకు ఆయన అతీతులు. రాజు గారికి సినిమా అంటే ఎంతో ప్యాషన్. 'ఆరిజిన్ ఆఫ్ అగధ', 'అగధ' ట్రైలర్ చూశాను. నాకు చాలా నచ్చాయి. రాజు గారు నిజంగా కింగ్ మేకర్. ఈ చిత్రం పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.ఎస్‌కేఎన్ మాట్లాడుతూ .. 'రాజు గారి సినిమాకి గెస్ట్ రావడమే నాకు గొప్ప అచ్ఛీవ్‌మెంట్. పోస్టర్ మీద రాజు గారి పేరు, శ్యాం ప్రసాద్ రెడ్డి గారి పేరు ఉంటే సినిమాని చూసేవాళ్లం. రాజు అందరిలో 'ఒక్కడు'. రాజు గారు తీస్తే కాసుల 'వర్షం'. ఆయనకి తెలియని 'ఆట' లేదు. ఆయన దర్శకుడిగా వచ్చి సక్సెస్ కొడతాను అంటే మేమొద్దంటామా. ఆయన 'పోలీస్ లాకప్' తీశారు. కానీ ఆయన మన గుండెల్లో లాక్ అయ్యారు. అప్పట్లో 'దేవి' సినిమా టికెట్లు దొరకడానికి పది రోజులు పట్టింది. ఆయన ప్రతీ సంక్రాంతికి వచ్చి హిట్లు కొట్టారు. అలాంటి రాజు 'అగధ'తో వస్తున్నారు. టీజర్, ట్రైలర్ నాకు చాలా నచ్చాయి. హారర్‌తో పాటు మిగతా అంశాలు కూడా ఇందులో ఉన్నాయనిపిస్తోంది. మంచి కంటెంట్ ఇస్తే ఆడియెన్స్ తప్పకుండా థియేటర్‌కి వచ్చి ఆదరిస్తారు. కామాక్షి కారెక్టర్ లెంగ్త్ కాకుండా.. అందులోని లెంగ్త్ చూస్తారు. శ్రవణ్ అద్భుతంగా అనిపించాడు. 'అగధ'లో నటించిన అందరికీ ఆల్ ది బెస్ట్. ఫస్ట్ సినిమాతోనే కాశీ విశాలాక్షి గారు, అజయ్ ఓ డేరింగ్ స్టెప్ వేశారు. 'అగధ'తో రాజు గారు హిట్ కొట్టాలి. రాజు ఎక్కడున్నా రాజే అన్నట్టు.. ఆయన.. నిర్మాతగా వచ్చినా రాజే.. దర్శకుడిగా వచ్చినా రాజే.. 'అగధ' అద్భుతమైన విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

సీనియర్ దర్శకులు బి. గోపాల్ మాట్లాడుతూ .. 'రాజు గారు, శ్యాం ప్రసాద్ ఇద్దరూ మంచి మిత్రులు. నిర్మాతల్లో నాకు వారిద్దరూ ఇష్టం. 'సమరసింహారెడ్డి' కథ విని బ్లాక్ బస్టర్ అవుతుందని రాజు గారు అన్నారు. కథ మీద ఆయనకు మంచి జడ్జ్‌మెంట్ ఉంటుంది. మేం ఇద్దరం కలిసి 'మస్కా' మూవీని చేశాం. రాజు గారు దమ్మున్న నిర్మాత. ఆయనలో గొప్ప రైటర్ ఉన్నారు. ఇప్పుడు 'అగధ'తో రాజు గారు మరోసారి విజయాన్ని సాధించబోతోన్నారు. టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఇలాంటి సినిమాని థియేటర్లోనే చూడాలి. అందరికీ ఆల్ ది బెస్ట్' అని అన్నారు.

పొలిమేర డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ .."అగధ' నాకు రైటింగ్ లెవెల్ నుంచీ తెలుసు. రాజు గారి కథా చర్చల్లో నేను ఉన్నాను. కానీ నాకు క్లైమాక్స్ చెప్పలేదు. ఆయన స్క్రీన్ ప్లే రైటింగ్ నెక్ట్స్ లెవెల్లో ఉంటుంది. గత నెలలోనే 'అగధ' చిత్రాన్ని చూశాను. ఒక రేంజ్‌లో ఉంది. ఆ క్లైమాక్స్ చూసి అంతా సర్ ప్రైజ్, షాక్ అవుతారు. ఆ క్లైమాక్స్ చాలా ఫ్యూచరిస్టిక్‌గా అనిపించింది. రాజు గారు తీసిన క్లాసిక్ సినిమాలు మాకు పాఠాలు. కామాక్షి నటనను ఇది వరకు చాలా సార్లు చూశాం. ఆమె ఇంత వరకు పావుగంట, అర్ధగంట నిడివి ఉన్న పాత్రలే వచ్చాయి. ఆ పాత్రలతోనే అవార్డ్ కూడా సాధించింది. 'అగధ'లో స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు కామాక్షి అదరగొట్టేసింది. శ్రవణ్ అందరిపై ఇంపాక్ట్ క్రియేట్ చేస్తాడు. జోవిక నెక్ట్స్ లెవెల్. ప్రతీ ఒక్క ఆర్టిస్ట్ అద్భుతంగా నటించారు. కథ విన్నప్పటి కంటే సినిమా చూశాక విజువల్స్ పది రెట్లు అనిపించింది. రాకేష్ మ్యూజిక్ గొప్పగా అనిపించింది. నాక్కూడా ఈ టీంతో పని చేయాలని అనిపిస్తోంది. 'అగధ' గురించి గొప్పగా చెప్పుకుంటారు. ఆగస్ట్ 14న అందరూ థియేటర్లో ఈ సినిమాని చూడండి' అని అన్నారు.

నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ .. "నిర్మాతల్లో నాకు రాజు గారు, శ్యాం ప్రసాద్ రెడ్డి గారు అంటే చాలా ఇష్టం. 'అగధ'తో రాజు గారు కమ్ బ్యాక్ అవుతారు. 'అగధ' కల్ట్ క్లాసిక్ అవ్వాలి. కామాక్షి గారు, శ్రవణ్ గారు, భాను చందర్ గారు ఇలా అందరినీ ఇక్కడ చూస్తుండటం ఆనందంగా ఉంది. 'అగధ' పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ .. "అగధ' జర్నీలో ఎంతో మంది నుంచి ఎంతో నేర్చుకున్నాను. నేను 9 ఏళ్ల క్రితం ఇండియాకి వచ్చాను. ఇప్పుడు నాకు 'అగధ'లాంటి అద్భుతమైన చిత్రం దొరికింది. తెలుగు ఇండస్ట్రీలో తెలుగమ్మాయిలకు అవకాశాలు రావడం చాలా అరుదు. ఇలాంటి టైంలో నాకు ఫీమేల్ లీడ్‌గా, సెంటర్ కారెక్టర్ ఇచ్చి, నన్ను నమ్మినందుకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. నా కోసం నా ఫ్యామిలీ ఎన్నో త్యాగాలు చేసింది. ఎలాంటి నేపథ్యం లేకుండా ఇక్కడి వరకు రావడం కూడా ఓ విజయమే. ఇంకో పదేళ్లు ఇండస్ట్రీలో ఉన్నా కూడా రాజు గారి గురించి చెప్తాను. రాజు గారే నా కెరీర్‌కి పునాది వేశారని గర్వంగా చెప్పుకుంటాను. మేం కష్టపడి, ఇష్టపడి ఈ మూవీని చేశాం. అదే ప్రేమను ఆడియెన్స్ తిరిగి ఇస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ .. "హిందీలో నా జర్నీ ప్రారంభమైంది. వెబ్ సిరీస్‌లో నన్ను చూసి 'డర్టీ హరి'కి రాజు గారు తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు 'అగధ'లో ఛాన్స్ ఇచ్చారు. విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఈ మూవీని తెరకెక్కించారు. ఎన్నో లేయర్లు ఉన్న కారెక్టర్‌ని నాకు ఇచ్చారు. ఇంత మంచి అవకాశం ఇచ్చిన రాజు గారికి థాంక్స్. లాంగ్ వీకెండ్ రాబోతోంది. మా మూవీని అందరూ చూసి సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు.

నటుడు గగన్ మాట్లాడుతూ .. "నిర్మాతగా రాజు గారు ఎన్నో గొప్ప చిత్రాల్ని అందించారు. దర్శకుడిగానూ ఇప్పుడు ఆయన మార్క్ వేస్తున్నారు. 'అగధ' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. 'అగధ'తో శ్రవణ్‌కి మంచి బ్రేక్ రావాలి. కామాక్షి గారికి సపరేట్ క్రేజ్ ఏర్పడింది. కాశీ విశాలాక్షి గారు, అజయ్ గారు మంచి వ్యక్తులు. అందరికీ ఆల్ ది బెస్ట్' అని అన్నారు.

నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు మాట్లాడుతూ .. "అగధ' సినీ ప్రయాణంలో మాకు తోడుగా నిలిచిన రాజు గారికి, మూవీ టీంకి థాంక్స్. 'అగధ' టీజర్, ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆగస్ట్ 14న విడుదల కాబోతోన్న మా 'అగధ' కూడా మంచి విజయాన్ని సాధిస్తుందని నమ్ముతున్నాను. ఇకపై రాజు గారు 'అగధ' రాజు అవుతారు. ఆయన సెట్‌లో ఎంతో కష్టపడ్డారు. ఆయన కష్టాన్ని చూసిన తర్వాతే 'అగధ' హిట్ అవుతుందని ఫిక్స్ అయ్యాను' అని అన్నారు.

నటి జోవికా విజయ్ కుమార్ మాట్లాడుతూ .. "అగధ'లో నటించడం ఆనందంగా ఉంది. ఆగస్ట్ 14న మా సినిమాని చూసి మా అందరినీ సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

నటుడు షిజు మాట్లాడుతూ .. 'రాజు గారి నుంచి 1996లో కాల్ వచ్చింది. హీరోగా ఓ సినిమా చేయాలని రాజు గారు అన్నారు. అప్పుడు నాకు తెలుగు రాదని అన్నాను. పర్లేదు కోడి రామకృష్ణ గారిని కలవమని ఆయన చెప్పారు. మూడేళ్లు కష్టపడి 'దేవి' మూవీని చేశాం. రాజు గారి జర్నీ నాకు తెలుసు. 'దేవి'తో మా కెరీర్ మారిపోయింది. మళ్లీ రెండేళ్ల తర్వాత 'మనసంతా నువ్వే'లో అవకాశం ఇచ్చారు. మళ్లీ ఇన్నాళ్లకి 'అగధ'లో అవకాశం ఇచ్చారు. తెలుగులో రాజు గారు నాకు గాడ్ ఫాదర్ లాంటి వారు. 'అగధ' పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

నటి వనితా విజయ్ కుమార్ మాట్లాడుతూ .. "దేవి'లో నన్ను పాము కరిచే సీన్ ఉంటుంది. నేను నాగదేవతని, అమ్మ వారిని నమ్మి ఆ సీన్ చేశాను. ఆ టైంలో అమ్మ వారే నన్ను కాపాడారు. 'అగధ'లోనూ అలాంటి గొప్ప సీన్స్ ఉన్నాయి. 'అగధ'ను అందరూ చూడాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

నటుడు భాను చందర్ మాట్లాడుతూ .. "అగధ' చిత్రంతో రాజు గారు టాప్ ప్లేస్‌కి వెళ్లాలని కోరుకుంటున్నాను. గుడ్ అండ్ ఈవిల్ మధ్య జరిగే కథే 'అగధ'. ఇలాంటి సినిమాని థియేటర్లో చూస్తేనే ఆ థ్రిల్ వస్తుంది. రాజు గారి సినీ కెరీర్‌లో 'అగధ' మైలు రాయిలా

Published at H.NO. 1-107/3, PALAKURTHIVILLAGE, RAMAGUNDAM DIST, KARIMNAGAR TELANGANA Editor: R. CHAITANYA, RNI NO. TELTEL/2014/61071 Cell: 9701676775